www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల.5.00

Published from: Hyderabad, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 1 | సంచిక : 175 | బుధవారం | 17 జూన్, 2026

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

✆ : 99484 33277 / 7288825681




## సర్కారు చదువుల్లో సరికొత్త అధ్యాయం

### ఆరుట్లలో విద్యా విప్లవానికి శ్రీకారం

తెలంగాణలో ప్రభుత్వ విద్యకు కొత్త దిశను చూపించే కీలక ఘట్టానికి ఆరుట్ల వేదిక కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్, టీపీఎస్ ప్రారంభంతో సర్కారు విద్యలో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యాధునిక వసతులు, నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్య, ఉచిత రవాణా, పోషకాహార సదుపాయాలతో ఈ పాఠశాల రూపుదిద్దుకుంది. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ నమూనా విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా వంద పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది.

**• పైలాన్ ఆవిష్కరణతో సీఎం పర్యటన ప్రారంభం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం 9:30 గంటలకు ఆరుట్ల గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలాన్‌ను ఆయన ఆవిష్కరిస్తారు. అనంతరం పాఠశాల ఆవరణలోని అత్యాధునిక డిజిటల్ తరగతి గదులు, గ్రంథాలయం, సైన్స్ ప్రయోగశాలలు, విశాలమైన డైనింగ్ హాల్, క్రీడా మైదానాలను సీఎం స్వయంగా పరిశీలిస్తారు. అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేస్తారు. ఆ తర్వాత ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడతారు. (వివరాలు 3లో..)

## సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

- రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచండి
- సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి
- వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగం పెరగాలి
- వ్యవసాయరంగంపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష





## గ్లోబల్ వేదికపై మోదీ ట్రంప్ కలయిక

**ఫ్రాన్స్ వేదికగా ఇరునేతల తొలి భేటీ**

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మోదీ-ట్రంప్ భేటీ జరిగింది. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సు వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు (3లో..)

## ఇంటి నిండా నోట్ల కట్టలు

- అక్రమాస్తులు రూ.150 కోట్లకు పైనే!
- ల్యాండ్ సర్వే అధికారి ఇళ్లంతా డబ్బే డబ్బు
- ఏసీబీ దాడుల్లో ఆస్తుల గుట్టురట్టు




తెలంగాణ ల్యాండ్ అండ్ సర్వే విభాగంలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి అక్రమాస్తుల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. మల్టీ జోన్ 2 డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావుపై అవినీతి నిరోధక శాఖ నిర్వహించిన సోదాల్లో కోట్ల రూపాయల నగదు, బంగారం, స్థిరాస్తుల పత్రాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌తో పాటు పది ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగిన దాడుల్లో అధికారులను సైతం ఆశ్చర్యపరిచే స్థాయిలో ఆస్తులు బయటపడ్డాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించిన ఏసీబీ, ఇప్పటివరకు రూ.13 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించినా అధికారిక లెక్కల ప్రకారం ఆ మొత్తం 150 కోట్ల పైమాటే.



## ఎక్కడికైనా వస్తా..

- మీ కాల్ కోసం వెయిటింగ్
- మెట్రోకు నిధులు ఇప్పించండి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం బహిరంగ లేఖ

హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 విస్తరణకు అవసరమైన కేంద్ర ప్రభుత్వ అనుమతులతో పాటు జైకా-ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆయన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. మెట్రో నిధుల విడుదల అంశంపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో తక్షణమే ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీఎం తన లేఖలో డిమాండ్ చేశారు. (వివరాలు 2లో..)

## మెట్రో వివాదంపై కిషన్ రెడ్డి కౌంటర్

- ఆధారాల్లేని ఆరోపణలు చేయడం తగదు
- రేవంత్ రెడ్డి అసత్య ప్రచారమన్న కేంద్ర మంత్రి



రేవంత్ రెడ్డి లేఖకు ముందు ఢిల్లీలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును తాను అడ్డుకుంటున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. (వివరాలు 2లో..)

## మెట్రోను అడ్డుకోవాల్సిన ఖర్మ మాకు లేదు

**రేవంత్ సర్కార్‌పై బండి సంజయ్ నిప్పులు**



తెలంగాణ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన ఖర్మ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి అస్సలు పట్టలేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అర్థంలేని ఆరోపణలను తాము పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. (వివరాలు 2లో..)

## బీజేపీ తొత్తుగా ఎన్నికల సంఘం

- అపహాస్యమవుతున్న ప్రజాస్వామ్యం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధ్వజం



కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న వేళ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం పూర్తిగా బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, ఓట్ల సర్వే ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని విమర్శించారు. (2లో..)



## నిరుద్యోగుల గొంతు నొక్కుతున్న సర్కార్

**లాఠీలతో నిరుద్యోగులను అణచివేయలేరు**

**రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఆగ్రహం**

దిల్‌సుఖ్‌నగర్‌లో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ (వివరాలు 2లో..)

## ఖాళీలు 19 వేలు నోటిఫికేషన్ ఐదు వేలకేనా?

- నిరుద్యోగులకు ద్రోహం
- రేవంత్ వైఖరిపై హరీశ్ రావు నిప్పులు



రాష్ట్ర పోలీస్ శాఖలో పంతొమ్మిది వేల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని కొత్త డీజీపీ సీవీ ఆనంద్ స్వయంగా అంగీకరించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు గుర్తుచేశారు. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఐదు వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకే ఎందుకు నోటిఫికేషన్ ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. (వివరాలు 2లో..)

## కాంట్రాక్టర్ల సమస్యలపై సర్కార్ యాక్షన్ ప్లాన్

### బకాయిలు చెల్లిస్తామన్న మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్రంలో కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బిల్డర్స్, కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘంగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంట్రాక్టర్ల సమస్యల పట్ల ఎంతో సానుకూలంగా ఉన్నారని, గత ప్రభుత్వం పెట్టిన



ఆర్థిక ఇబ్బందుల నుంచి రక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన హామీ ఇచ్చారు. (వివరాలు 7లో..)

## నీట్ పరీక్ష అక్రమాలకు అడ్డుకట్ట

- » టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం
- » టెలిగ్రామ్‌పై కేంద్రం కీలక నిర్ణయం

భారతదేశంలో వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ రీఎగ్జామ్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. జూన్ 21న జరగబోయే ఈ పరీక్షలో ఎటువంటి అక్రమాలు జరగకుండా చూడడానికి టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలికంగా ఆంక్షలు విధించింది. ఈ నిర్ణయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పూర్తిగా స్వాగతించింది. పరీక్షల చుట్టూ జరిగే మోసాలను, తప్పుడు సమాచారాన్ని నియంత్రించడానికి ఈ చర్య చాలా అవసరమని స్పష్టం చేసింది. (3లో..)



## నాగ్‌పూర్‌లో ఘోరం

- » వాయుసేన అధికారి భార్యపై అత్యాచారం
- » బలవంతపు మతమార్పిడి
- » నిందితుల అరెస్ట్, పోలీసుల వేట



మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో అత్యంత దిగ్భ్రాంతికరమైన ఘటన వెలుగుచూసింది. ఇండియన్ ఆర్మీ అధికారి భార్యపై పాత క్లాస్‌మేట్, అతని స్నేహితులు కలిసి అత్యాచారం, బ్లాక్‌మెయిల్, క్షుద్రపూజలు, బలవంతపు మతమార్పిడికి పాల్పడ్డారు. ఈ దారుణానికి సంబంధించిన కేసులో నాగ్‌పూర్ పోలీసులు ప్రధాన నిందితుడు అయాజ్ మదారేతో పాటు అతని అనుచరుడు అమీన్ షేక్‌ను అరెస్ట్ చేశారు. ఈ నేరంలో భాగస్వామి అయిన ఒక మత గురువు (మౌలానా) కోసం పోలీసులు ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. (వివరాలు 3లో..)




## డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

- » గోవా టు హైదరాబాద్ డ్రగ్స్ గుట్టురట్టు
- » రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో ఈగల్ ఫోర్స్ దాడులు

## అన్నలు లేరని అలుసు తీసుకుంటే ఖబర్దార్

**ఇప్పుడు వారంతా మా పార్టీలోనే ఉన్నారు**

**సింగరేణి యాజమాన్యానికి కవిత స్ట్రాంగ్ వార్నింగ్**







## దుర్గమ్మ చెంత సిరిసిల్ల నేతన్న అద్భుత సృష్టి

**అమ్మవారికి అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర కానుక**

## అమెజాన్ ఉద్యోగం వదిలి ఉబెర్ డ్రైవర్

- ఇంటర్నెట్‌లో స్ఫూర్తిదాయక ప్రయాణం
- కార్పొరేట్ కొలువు వదులుకున్న కుమార్



# మెట్రో వివాదంపై కిషన్ రెడ్డి కౌంటర్

- ఆధారాల్లేని ఆరోపణలు చేయడం తగదు
- రేవంత్ రెడ్డి అసత్య ప్రచారమన్న కేంద్ర మంత్రి



రేవంత్ రెడ్డి లేఖకు ముందు ఢిల్లీలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును తాను అడ్డుకుంటున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ఏడేళ్లుగా కేంద్ర మంత్రిగా తాను తెలంగాణ ప్రయోజనాల కోసమే పనిచేశానని స్పష్టం చేశారు. కిషన్ రెడ్డి చెబితే కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టులను ఆపదని, ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు.

### మెట్రో ఫేజ్-2 కు సూత్రప్రాయ అంగీకారం

హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 50:50 నిష్పత్తి భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి స్వయంగా ముఖ్యమంత్రికి తెలిపారన్నారు. గతంలో మెట్రో ఫేజ్ 1 ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 1,250కోట్లు అందించిందని, ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే అది ప్రారంభమైందని గుర్తుచేశారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు పూర్తి చిత్తశుద్ధి ఉందని, దీనికోసం కాంగ్రెస్ పార్టీ సర్టిఫికెట్లు తమకు అస్సలు అవసరం లేదన్నారు.

### ఐఆర్ఎఫ్‌సీ రుణ నిబంధనలపై స్పష్టత

రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్ఎఫ్‌సీ సంస్థతో కుదుర్చుకున్న రూ. 13,500 కోట్ల రుణ ఒప్పందం విషయంలో తానేనాడూ జోక్యం చేసుకోలేదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే మెట్రో ఆదాయం నుంచి ముందుగా ఐఆర్ఎఫ్‌సీ రుణాలను చెల్లించేలా రేవంత్ రెడ్డి నిబంధనలు పెట్టారని, దానిపైనే కేంద్రం కొన్ని సాంకేతిక సూచనలు చేసిందని వివరించారు. దేశవ్యాప్తంగా ఏ మెట్రో సంస్థ కూడా అప్పులను ముందే కట్టదని, వచ్చే ఆదాయాన్ని మొదట ఆపరేషన్స్, మెయింటెనెన్స్ కోసం ఖర్చు చేయాలని సూచించారు. అప్పుడే మెట్రో నిలదొక్కుకుంటుందని తాము చెబుతుంటే ముఖ్యమంత్రి అంగీకరించడం లేదన్నారు.

### సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునే కుట్ర

కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఇదంతా చేస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. గతంలో కేసీఆర్ అలైన్‌మెంట్ మార్పు పేరుతో మూడేళ్లు కాలయాపన చేస్తే, నేడు రేవంత్ రెడ్డి కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల అమలును గాలికొదిలేసి ప్రతిపక్షాలపై పడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణకు ఒక రూపాయి వచ్చినా సంతోషపడే మొదటి వ్యక్తిని తానేనని, ఈ ప్రాజెక్టు సమస్యను పరిష్కరించడానికి కేంద్ర మంత్రితో నిర్వహించే సమావేశానికి ముఖ్యమంత్రితో కలిసి వచ్చేందుకు తనకు ఎలాంటి భేషజాలు లేవని కిషన్ రెడ్డి ప్రకటించారు.

# ఎక్కడికైనా వస్తా..

- మీ కాల్ కోసం వెయిటింగ్
- మెట్రోకు నిధులు ఇప్పించండి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం బహిరంగ లేఖ



హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 విస్తరణకు అవసరమైన కేంద్ర ప్రభుత్వ అనుమతులతో పాటు ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆయన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. మెట్రో నిధుల విడుదల అంశంపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో తక్షణమే ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీఎం తన లేఖలో డిమాండ్ చేశారు.

### నగర విస్తరణకు అనుగుణంగా ఫేజ్-2

హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం ఫేజ్ 1 పరిధిలోని మూడు కారిడార్లలో 69 కిలోమీటర్ల మేర మెట్రో రైళ్లు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. నగర జనాభా పెరగడం, చుట్టుపక్కల ప్రాంతాలు విస్తరించడం వల్ల మెట్రో నెట్‌వర్క్‌ను మరింత పెంచాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అందుకే మొత్తం 7 కారిడార్లు, 122.9 కిలోమీటర్ల కొత్త మార్గం కోసం సుమారు 38,595 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఫేజ్ 2 ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించిందని వివరించారు.

### కేంద్రం అభ్యంతరాలపై అసాధారణ నిర్ణయం

ఫేజ్ 1 ప్రైవేటు నిర్వహణలో ఉండటం, ఫేజ్ 2ను ప్రభుత్వ భాగస్వామ్యంతో వేరే విధానంలో అమలు చేయడంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కొన్ని అభ్యంతరాలను లేవనెత్తిందని సీఎం పేర్కొన్నారు. కేంద్రం చెప్పిన అంశాలను సానుకూలంగా స్వీకరిస్తూ మొత్తం మెట్రో వ్యవస్థ అంతా ఒకే నెట్‌వర్క్ కింద నడవాలనే ఉద్దేశంతో ఫేజ్ 1ను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా స్వాధీనం చేసుకోవాలనే ఒక అసాధారణ నిర్ణయాన్ని తీసుకున్నట్లు లేఖలో స్పష్టం చేశారు.

### రూ. 15 వేల కోట్ల ఆర్థిక లావాదేవీలు

ఫేజ్ 1 స్వాధీనం ప్రక్రియలో భాగంగా ఈక్విటీ కొనుగోలుకు 1,461.47 కోట్ల రూపాయలు, ప్రాజెక్టు పాత అప్పుల రీఫైనాన్సింగ్ కోసం 13,538.53 కోట్ల రూపాయలు కలిపి మొత్తం 15,000 కోట్ల రూపాయల లావాదేవీలు ఉన్నాయని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతాధికారుల కమిటీ అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని, ఈ కమిటీలో కేంద్ర ప్రభుత్వం తరఫున యూపీఎంఆర్‌సీఎల్ ఎండీ సుశీల్ కుమార్ కూడా సభ్యుడిగా ఉన్నారని గుర్తుచేశారు.

### షరతులు నెరవేర్చినా అందని రుణం

కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఐఆర్ఎఫ్‌సీ ఈ ప్రాజెక్టును పూర్తిగా పరిశీలించి రుణ మంజూరు ఒప్పందం చేసిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ రుణానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి గ్యారంటీ ఇవ్వడంతో పాటు ఆర్‌బీఐ ద్వారా డైరెక్ట్ డెబిట్‌కు కూడా అంగీకరించిందన్నారు. ఐఆర్ఎఫ్‌సీ షరతుల ప్రకారం మొదటి విడత నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 84.32 కోట్ల రూపాయల అప్‌ఫ్రంట్ ఫీజు చెల్లించిందని, ఈక్విటీ నిధులు 1,461.47 కోట్ల రూపాయలను ఇప్పటికే ఎస్క్రో ఖాతాలో జమ చేసిందని తెలిపారు. అన్ని షరతులు నెరవేర్చినప్పటికీ 2026 జూన్ 15న విడుదల కావలసిన మొదటి విడత రుణం నిలిచిపోవడంపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు.

### ప్రభుత్వం దానం అడగటం లేదు

ఈ నిధుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రం నుంచి ఎలాంటి ఉచిత దానాన్ని ఆశించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖలో కచ్చితంగా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారమే తమకు రావలసిన ఐఆర్ఎఫ్‌సీ రుణాన్ని విడుదల చేయించాలని కోరుతున్నామన్నారు. తెలంగాణ నుంచి కేంద్రంలో సీనియర్ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి ఈ విషయంలో ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, నిధులు త్వరగా వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

### సొంత వనరులతోనైనా ముందుకు వెళ్తాం

మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 50:50 జాయింట్ వెంచర్‌గా ఆమోదించాలని తాము కోరుతున్నట్లు సీఎం తెలిపారు. ఒకవేళ కేంద్రం నుంచి అనుమతులు ఆలస్యమైతే, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధుల కోసం వేచి చూడకుండా తన సొంత వనరులు, ఇతర సంస్థాగత రుణాల ద్వారా ఫేజ్ 2 పనులను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దీనికి అవసరమైన ముందస్తు అనుమతులను కేంద్రం నుంచి త్వరగా ఇప్పించాలని కోరారు. రైల్వే మంత్రితో జరిగే సమావేశానికి తానే స్వయంగా అధికారులతో కలిసి హాజరై అన్ని ఆధార పత్రాలతో వివరణలు ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు

# మెట్రోను అడ్డుకోవాల్సిన ఖర్మ మాకు లేదు

- రేవంత్ సర్కార్‌పై బండి సంజయ్ నిప్పులు



తెలంగాణ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన ఖర్మ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి అస్సలు పట్టలేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అర్థంలేని ఆరోపణలను తాము పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. తమ దేశభక్తికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చే సర్టిఫికెట్ అంతకన్నా అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

### ఎస్ఐఆర్ పేరుతో మతాల మధ్య చిచ్చు

కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే ఎస్ఐఆర్ పేరుతో సమాజంలో మతాల మధ్య చిచ్చు పెడుతోందని కేంద్ర మంత్రి తీవ్రంగా ఆరోపించారు. హిందువులు, ముస్లింలు అనే తేడా లేకుండా తెలంగాణ ప్రజలంతా తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక ముస్లింలను బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాల అక్రమ చొరబాటుదారులతో కాంగ్రెస్ పోలుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఓట్ల సర్వే విషయంలో కాంగ్రెస్ పార్టీ కావాలనే గందరగోళం సృష్టిస్తోందని ఆరోపించారు.

### దొంగ ఓట్లపై కాంగ్రెస్ డ్రామాలు

ఒకపక్క స్థానిక ముస్లింల ఓట్లను తొలగిస్తూ, ఆ నెపాన్ని బీజేపీపై నెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని బండి సంజయ్ ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్ తరహాలో అక్రమ వలసదారులతో రాజకీయం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బంగ్లాదేశ్ వాళ్లకు ఇక్కడ ఓటు హక్కు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఇతర దేశాల వారి దొంగ ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ నాయకులు ఎందుకు డిమాండ్ చేయడం లేదని నిలదీశారు. ప్రతీ భారతీయ పౌరుడి ఓటు హక్కును కాపాడే బాధ్యత తమ పార్టీదేనని స్పష్టం చేశారు.

### మోదీ నాయకత్వంలో ప్రగతి పరుగులు

ప్రపంచ దేశాలు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో అతలాకుతలమవుతున్న వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం మాత్రం ప్రగతి పథంలో పరుగులు పెడుతోందని బండి సంజయ్ కొనియాడారు. ఒకవైపు రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలతో దేశ మౌలిక వసతుల రూపురేఖలు మారుస్తున్నారని చెప్పారు. మరోవైపు ఉచిత రేషన్, పక్కా ఇళ్లు, ఉచిత వైద్యం అందిస్తూ మోదీ పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. దేశంలో ప్రస్తుతం అభివృద్ధిలో నవశకం, సంక్షేమంలో స్వర్ణయుగం నడుస్తోందని ప్రశంసించారు.

### తుపాకీ గొట్టంతో ఏమీ సాధించలేరు

దేశంలో మావోయిస్టుల హింసాత్మక విధానాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తుపాకీ గొట్టం వల్ల అభం శుభం తెలియని మైనర్లు, ఎంతోమంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. హింస ద్వారా ఏమీ సాధించలేమని మావోయిస్టు అగ్రనేతలు సైతం గుర్తించి, కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తూ లొంగిపోతున్నారని చెప్పారు. మావోయిస్టులు ఇక లేరని, ఆ భావజాలంతో ఉన్నవారు తక్షణమే తమ ఆలోచనలను విరమించుకోవాలని సూచించారు.

# నిరుద్యోగుల గొంతు నొక్కుతున్న సర్కార్

- లాఠీలతో నిరుద్యోగులను అణచివేయలేరు
- రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఆగ్రహం



దిల్‌సుఖ్‌నగర్‌లో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. రోడ్ల వెంట యువతను తరుముతూ కొట్టడం, వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి దర్పణం పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపడం నిరంకుశత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు.

### ఇదేనా మీ ఇందిరమ్మ ప్రజా పాలన?

ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసుల సాయంతో అణగదొక్కడమే కాంగ్రెస్ పార్టీ చెబుతున్న ఇందిరమ్మ ప్రజా పాలననా అని కేటీఆర్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఏడాదికి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను దారుణంగా మోసం చేశారని విమర్శించారు. మెగా నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ అంటూ ఆశలు కల్పించి నేడు వారి నోట్లో మట్టి కొడుతున్నారని మండిపడ్డారు. చాలా రోజులుగా యూనివర్సిటీల్లో నిరసనలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

### ఇరవై వేల పోలీసు ఉద్యోగాలివ్వాలి

రాష్ట్రంలో ప్రస్తుతం ఇరవై వేల వరకు పోలీస్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం కేవలం ఐదు వేల పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూడటం దారుణమన్నారు. ఎన్నో ఏళ్లుగా కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వెంటనే ఇరవై వేల కానిస్టేబుల్ పోస్టులతో ఒక మెగా నోటిఫికేషన్ విడుదల చేయాలని పట్టుబట్టారు.

### అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలి

తమ హక్కుల కోసం పోరాడుతూ దిల్‌సుఖ్‌నగర్‌లో అరెస్టయిన నిరుద్యోగ జేఏసీ నేతలను, అమాయక విద్యార్థులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆవేదనను లాఠీ దెబ్బలతో అణచివేయలేరని స్పష్టం చేశారు. కేవలం లాఠీలతో యువత గొంతు నొక్కాలని చూస్తే ఈ ప్రభుత్వానికి త్వరలోనే కాలం చెల్లినట్లేనని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. పోలీసులను ప్రయోగించి ఉద్యమాలను ఆపలేరని ఆయన తేల్చి చెప్పారు.

### నిరుద్యోగులకు బీఆర్ఎస్ అండ

కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే తన మొండి వైఖరిని విడనాడాలని కేటీఆర్ హితవు పలికారు. కానిస్టేబుల్ పోస్టుల సంఖ్య పెంపుతో పాటు, పోలీసు అభ్యర్థుల వయోపరిమితి సడలింపు తదితర న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించకపోతే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా నిలబడి ప్రత్యక్ష పోరాటం చేస్తుందని ఆయన స్పష్టమైన భరోసా ఇచ్చారు.

# బీజేపీకి తొత్తుగా ఎన్నికల సంఘం

- అపహాస్యమవుతున్న ప్రజాస్వామ్యం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధ్వజం



కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న వేళ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం పూర్తిగా బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, ఓట్ల సర్వే ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో లక్షలాది ఓట్ల తొలగింపును ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ప్రతిపక్షాలకు మద్దతుగా ఉన్న ఓటర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, విభజన హామీల అమలు, తెలంగాణకు నిధుల కేటాయింపుపై కూడా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకత్వంపై విమర్శలు గుప్పించారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశంలో తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా బీజేపీకి తొత్తుగా మారిందని ఆయన ఆరోపించారు. కేవలం కమలం పార్టీకి రాజకీయ లబ్ధి చేకూర్చేందుకే ఓట్ల సర్వే ప్రక్రియను వాడుకుంటున్నారని మండిపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి కుట్రలు సాగడం దారుణమన్నారు.

### బెంగాల్లో 92 లక్షల ఓట్ల అక్రమ తొలగింపు

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఓట్ల సర్వే పేరుతో ఏకంగా 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించడమే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని పీసీసీ చీఫ్ వివరించారు. బిజెపికి ఓట్లు పడవని భావించే ప్రాంతాలలో కావాలనే ఓట్లను గల్లంతు చేస్తున్నారని విమర్శించారు. ఈ తప్పుడు ప్రక్రియ వల్ల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, జగ్గారెడ్డితో పాటు తన ఓటు పోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బూత్ లెవెల్ ఏజెంట్లు ఎంతో కీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### పవన్ కల్యాణ్ వెనుక కమలం కుట్రలు

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ ఉందని పీసీసీ చీఫ్ ఆరోపించారు. కమలం పార్టీ ఆడించినట్లే పవన్ కల్యాణ్ ఆడుతున్నారని, ఆయన సానుభూతి తమకు అవసరం లేదని స్పష్టం చేశారు. పవన్ చేస్తున్న రాజకీయ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని హితవు పలికారు. తెలంగాణ వచ్చినప్పుడు పది రోజులు అన్నం తినలేదన్న పవన్ పాత వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలకు మహేశ్ కుమార్ గౌడ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. గత 12 ఏళ్లలో కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో కిషన్ రెడ్డి చిట్టా విప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావలసిన నిధులను ఇవ్వకుండా కేంద్రం తొక్కిపెడుతోందని, విభజన హామీలను ఇప్పటివరకు నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం సబర్మతి ప్రాజెక్టు కట్టుకోవచ్చు కానీ, తాము మూసి నది ప్రక్షాళన చేస్తామంటే నిధులు ఇవ్వరా అని నిలదీశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బిజెపి, బిఆర్ఎస్ ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.

# ఖాళీలు 19 వేలు

- నోటిఫికేషన్ ఐదు వేలకేనా?
- నిరుద్యోగులకు ద్రోహం
- రేవంత్ వైఖరిపై హరీశ్ రావు నిప్పులు



రాష్ట్ర పోలీస్ శాఖలో పంతొమ్మిది వేల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని కొత్త డీజీపీ సీవీ ఆనంద్ స్వయంగా అంగీకరించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు గుర్తుచేశారు. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఐదు వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకే ఎందుకు నోటిఫికేషన్ ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పదిహేడు వేల ఖాళీలు ఉంటే ఒకేసారి అన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

### ఎన్నికల ముందేమో ఫ్రీ ఇప్పుడు డబుల్

చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలలో నిరుద్యోగ యువత రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా ముఖ్యమంత్రికి చీమ కుట్టినట్లు కూడా లేదని హరీశ్ రావు మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో పరీక్షల ఫీజులు పూర్తిగా ఉచితం అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి వచ్చాక రూ.400 గా ఉన్న ఫీజును రూ.800 కు పెంచిందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందేమో ఫ్రీ అని చెప్పి, గెలిచిన తర్వాత డబుల్ బాదుడు బాదడం నిరుద్యోగులను దగా చేయడమేనన్నారు.

### గురుకులాల టెండర్లలో భారీ కుంభకోణం

గురుకుల పాఠశాలల్లో చదువుకునే పేద పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పుల సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా రూ.2,000కోట్ల భారీ స్కామ్‌కు పాల్పడిందని హరీశ్ రావు ఆరోపించారు. చిన్న పిల్లల ఆహారంలో కూడా అవినీతికి పాల్పడటం దారుణమన్నారు. ఈ టెండర్ల పరిమాణంపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. యూనిఫామ్‌ల కోసం రూ.1,200 కోట్లు, నిత్యావసరాల కోసం రూ.800 కోట్లతో కలిపి మొత్తం రూ.2,000 కోట్ల టెండర్లు పిలిచిన విషయం కూడా సొంత మంత్రులకు తెలియకపోవడం వారి పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు.

### అనుముల వారే కోటీశ్వరులయ్యారు

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి నమ్మబలికారన్నారు. కానీ ఏడాది గడుస్తున్నా ఆ మహిళలు ఎవరూ కోటీశ్వరులు కాలేదని, ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన అనుముల వారి నలుగురు అన్నాదమ్ములు మాత్రం విపరీతంగా అక్రమాస్తులు కూడబెట్టి కోటీశ్వరులుగా మారారని హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ మొత్తం టెండర్లను ముఖ్యమంత్రి తన కుటుంబ సభ్యులకే కట్టబెడుతున్నారని ఆరోపించారు.

# దుర్గమ్మ చెంత సిరిసిల్ల నేతన్న అద్భుత సృష్టి

- అమ్మవారికి అగ్గిపెట్టె లో పట్టే పట్టుచీర



విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు తెలంగాణలోని సిరిసిల్లకు చెందిన ప్రముఖ చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ తన అద్భుత కళాఖండాన్ని బహూకరించారు. అగ్గిపెట్టెలో సులభంగా ఇమిడిపోయే ఒక ప్రత్యేకమైన పట్టుచీరను ఆయన మంగళవారం ఉదయం ఆలయ ఈవో శీనానాయక్‌కు అందజేశారు. సాంప్రదాయ ఇక్కత్ డిజైన్‌తో మగ్గంపై నేసిన ఈ పట్టుచీర దాదాపు ఐదున్నర మీటర్ల పొడవు, 48 అంగుళాల వెడల్పు ఉంటుందని చేనేత కళాకారుడు విజయ్‌కుమార్ గర్వంగా వివరించారు. ఈ అద్భుతమైన చీరను మలచడానికి తనకు వారం రోజుల పాటు నిరంతర శ్రమ పట్టిందని ఆయన తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని తట్టుకునేందుకు వీలుగా ఆలయ అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సుమారు 82 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో చేపట్టిన వివిధ నిర్మాణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఇంద్రకీలాద్రిపై నిర్మిస్తున్న ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, ఆరు అంతస్తుల భారీ ప్రసాదం పోటు, నూతన అన్నప్రసాదం కాంప్లెక్స్ పనులు చాలా వరకు పూర్తయ్యాయని ఆలయ అధికారులు వెల్లడించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యాధునిక వసతులతో వీటిని తీర్చిదిద్దుతున్నారు. రాబోయే జులై చివరి నాటికి ఈ నూతన సదుపాయాలన్నింటినీ భక్తులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షిస్తున్నారు.

# అమెజాన్ ఉద్యోగం వదిలి ఉబెర్ డ్రైవర్

- ఇంటర్నెట్‌లో స్ఫూర్తిదాయక ప్రయాణం

### కార్పొరేట్ కొలువు వదులుకున్న కుమార్

హైదరాబాద్‌కు చెందిన కుమార్ అనే వ్యక్తి తన జీవితంలో తీసుకున్న ఒక అసాధారణ నిర్ణయం ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. అతను గతంలో ప్రముఖ బహుళజాతి సంస్థ అమెజాన్లో మంచి కార్పొరేట్ ఉద్యోగం చేసేవాడు. ఆ ఉద్యోగంలో మంచి జీతం ఉన్నప్పటికీ అతనికి మానసిక ప్రశాంతత, సంతోషం లభించలేదు. దీంతో తన మనసుకు నచ్చిన పనిని చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆఫీసు నాలుగు గోడల మధ్య బంధీగా ఉండే జీవితం కంటే సమాజంలో తిరగడం అతనికి ఇష్టమని గ్రహించాడు.

### ఉబెర్ సంస్థలో కొత్త ప్రయాణం

కుమార్ తన కార్పొరేట్ ఉద్యోగానికి రాజీనామా చేసి 2014వ సంవత్సరంలో హైదరాబాద్‌లో ఉబెర్ క్యాబ్ సేవలు ప్రారంభమైన కొత్తలోనే డ్రైవర్‌గా చేరాడు. ఒక పెద్ద కంపెనీలో సాఫ్ట్‌వేర్ రంగానికి సంబంధించిన ఉద్యోగాన్ని వదిలి డ్రైవర్‌గా మారడం సాధారణ విషయం కాదు. కానీ కుమార్ సమాజం ఏమనుకుంటుందో అనే విషయాలను అస్సలు పట్టించుకోలేదు. తన సొంత నగరాన్ని చుట్టేయడం, ప్రతిరోజూ కొత్త వ్యక్తులను కలవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని అతను నమ్మాడు.

### వైరల్ అయిన వీడియో విశేషాలు

ఇటీవల చేతనా సింగ్ అనే సాఫ్ట్‌వేర్ డెవలపర్ కుమార్ నడుపుతున్న ఉబెర్ క్యాబ్‌లో ప్రయాణించింది. ఆ ప్రయాణంలో వారిద్దరి మధ్య జరిగిన సంభాషణను ఆమె వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. ఆ వీడియోలో కుమార్ మాట్లాడుతూ తను ఇప్పటివరకు సుమారు 23,600 రైడ్‌లను విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పాడు.

17HYD_MAIN03_MAIN 03 17-Jun-26 08:50 AM Page 2



# అమెరికాలో 'భారతీయత-2026' వైభవోత్సవం

## మహర్షుల జ్ఞాన సంపదకు విశిష్ట నివాళి.. సనాతన ధర్మ వైభవానికి ప్రపంచ వేదికపై ప్రతిధ్వని

ఏవాన్ (కనెక్టికట్), అమెరికా: అమెరికాలోని కనెక్టికట్ రాష్ట్రం ఏవాన్ హైస్కూల్ ప్రాంగణంలో జూన్ 13న నిర్వహించిన 'భారతీయత--2026' కార్యక్రమం భారతీయ సంస్కృతి, మహర్షుల జ్ఞాన వారసత్వం, సనాతన ధర్మ విలువలను ప్రపంచ వేదికపై చాటిచెప్పిన సాంస్కృతిక-ఆధ్యాత్మిక మహోత్సవంగా నిలిచింది. సత్సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో అమెరికాతో పాటు పలు దేశాల నుంచి వచ్చిన 800 మందికిపైగా కళాకారులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, ప్రేక్షకులు పాల్గొన్నారు. సత్యం, ధర్మం, జ్ఞానం, లోకకల్యాణం వంటి భారతీయ శాశ్వత విలువలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించగా, మాజీ భారత రాయబారి డాక్టర్ మిత్రా వశిష్ఠ ముఖ్య అతిథిగా, న్యూయార్క్ భారత దౌత్య కార్యాలయ ప్రతినిధి సేవాంగ్ గ్యాల్ట్సన్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్సంకల్ప ఫౌండేషన్ కొత్త లోగోను ఆవిష్కరించడంతో పాటు భారతీయ జ్ఞాన సంపదకు చెందిన 'పరాశర సంహిత' గ్రంథాన్ని విడుదల చేసి ప్రచురణ రంగంలోకి అధికారికంగా అడుగుపెట్టింది. అలాగే సత్సంకల్ప ఫౌండేషన్, సుపథ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రొఫెసర్ రాఘవేంద్రన్ రచించిన 'గురుదేవోభవ' గ్రంథాన్ని కూడా ఆవిష్కరించాయి. సద్గురు శ్రీ శివానందమూర్తి ఆశయాల ప్రచారంలో విశేష కృషి చేస్తున్న సుపథ ఫౌండేషన్ ట్రస్టీ కుమారి రాధారాణిని సన్మానించారు. అనంతరం ప్రముఖ ఇంజినీర్, రచయిత డాక్టర్ ఏవీ శ్రీనివాసన్, సాంస్కృతికవేత్త డాక్టర్ కాశీనాథుని ఎం ప్రసాద్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత పండిత్ వామదేవ శాస్త్రి (డాక్టర్ డేవిడ్ ఫ్రాలీ)లకు 'శివానంద స్మృతి పురస్కారం' ప్రదానం చేశారు. భరద్వాజ మహర్షి జ్ఞాన కేంద్రం ఈ మహోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైమానిక శాస్త్రం, ఆయుర్వేదం, ధనుర్వేదం, రాజధర్మం వంటి రంగాల్లో భరద్వాజ మహర్షి చేసిన కృషిని ఆధునిక దృక్కోణంలో పరిచయం చేయడంతో సందర్శకులు విశేష ఆసక్తి కనబరిచారు. అదే సమయంలో 'సీర్స్ ఆఫ్ భారత్ - భరద్వాజ మహర్షి' నృత్యనాటిక మహర్షి జీవితం, తపస్సు, జ్ఞానసాధనను కళాత్మకంగా ఆవిష్కరించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. డాక్టర్ మిత్రా వశిష్ఠ భారతదేశపు 'సాఫ్ట్ పవర్' ద్వారా ప్రాచీన జ్ఞానాన్ని ఆధునిక ప్రపంచంతో అనుసంధానించే అవసరాన్ని వివరించగా, సేవాంగ్ గ్యాల్ట్సన్ భారతీయ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో ఇటువంటి కార్యక్రమాల ప్రాధాన్యాన్ని కొనియాడారు. డాక్టర్ ఏవీ శ్రీనివాసన్ హిందూ ధర్మాచరణలో తన అనుభవాలను పంచుకోగా, పండిత్ వామదేవ శాస్త్రి సద్గురు శ్రీ శివానందమూర్తితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ ఆత్మవిద్యే నిజమైన జ్ఞానానికి మూలమని పేర్కొన్నారు. సత్సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీధర్ తాళ్ళపాక మాట్లాడుతూ, సాంకేతికంగా ప్రపంచం అభివృద్ధి చెందినా మానవ జీవితంలో



ఆందోళన, ఒంటరితనం పెరుగుతున్నాయని, మహర్షుల జ్ఞానం నేటి సమాజానికీ మార్గదర్శకమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మహర్షి గురించి లోతుగా తెలుసుకోవాలని, కుటుంబ సంప్రదాయాలను ఆచరించి భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కనెక్టికట్‌కు చెందిన కుటుంబాలు దేశ విదేశాల నుంచి వచ్చిన అతిథులకు ఆత్మీయ ఆతిథ్యం అందించడంతో 'అతిథిదేవో భవ' భావనకు ప్రత్యక్ష రూపం కనిపించింది. మరో విశేషంగా, భారతీయత-2026 సందేశాన్ని న్యూయార్క్ నగరంలోని ప్రపంచ ప్రసిద్ధ టైమ్స్ స్క్వేర్‌లో ప్రదర్శించడం ద్వారా భారతీయ సంస్కృతి, మహర్షుల జ్ఞాన వారసత్వానికి అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు లభించింది. కార్యక్రమం ముగింపులో పాల్గొన్నవారు భారతీయత అనేది కేవలం ఒక సాంస్కృతిక ఉత్సవం మాత్రమే కాదని, భారతీయ విలువలు, మహర్షుల జ్ఞానం, సనాతన ధర్మంతో మన అనుబంధాన్ని మరింత బలపరిచే ఆత్మీయ అనుభవమని అభిప్రాయపడ్డారు. వేల ఏళ్ల క్రితం మహర్షులు అందించిన జ్ఞానం నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందనే సందేశాన్ని ఈ మహోత్సవం మరోసారి బలంగా చాటిచెప్పింది.



# బాసర-ఐఐఐటీ విద్యార్థులకు ఎమ్మెల్యే సంజయ్ అభినందనలు

**పోరండ్ల పాఠశాల విద్యార్థులతో భేటీ**

జగిత్యాల, జూన్ 16 : బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన జగిత్యాల మండలం పోరండ్ల పాఠశాల విద్యార్థులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అభినందించారు. పోరండ్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు పి. శ్రీవల్లి, పి. గంగోత్రి, పి. దీప్తి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా వారు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరింతగా ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీమనోహర్ చారి, ఉపాధ్యాయురాలు జమున, గ్రామ సర్పంచ్ నక్క హరీశ్, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీలతో పిల్లల్లో మనో వికాసం

**సర్వాపూర్‌లో అంగన్వాడీ-బాడిబాట కార్యక్రమం**

మల్యాల, జూన్ 16 : అమ్మ మాట-అంగన్వాడీ బడి బాట కార్యక్రమంలో భాగంగా సర్వపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం ప్రీస్కూల్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులకు ప్రీస్కూల్ విద్య ప్రాధాన్యం, పిల్లల శారీరక-మానసిక వికాసానికి తోడ్పడే ఆటలు, కథలు, పాటలు, మంచి అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న అంగన్వాడీ సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. పిల్లలకు విద్యా, వినోద ఆటబొమ్మలను ప్రదర్శించి, వాటి ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగిలి హనుమంతు, వార్డు సభ్యులు, తల్లులు, అంగన్వాడీ టీచర్లు శాంత, మధుమతి, సూపర్‌వైజర్ షమీమ్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 16: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న సైబర్ సెక్యూరిటీ కోర్సులకు తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ విమలా రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా, ఇంజినీరింగ్ చదువుతున్న లేదా పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్, మాస్టర్ ప్రోగ్రామ్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, శిక్షణ కాలం 5 నుంచి 10 నెలల వరకు ఉంటుందని, శిక్షణ పూర్తయిన అనంతరం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన వారికి సాఫ్ట్‌వేర్, ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, రిటైల్, ఈ-కామర్స్, విద్యా రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్, పెనెట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ ఇంజనీర్, సెక్యూరిటీ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్, ట్రైనర్ వంటి ఉద్యోగాల్లో అవకాశాలు లభించే వీలుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7893141797 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్‌కు దావ వసంత వినతి**

జగిత్యాల, జూన్ 16 : ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన అంశాలపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన లేకపోవడంతో అనేక అపోహలు, సందేహాలు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. కొత్త అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దడం, మరణించిన లేదా అనర్హులైన వ్యక్తుల పేర్లను తొలగించడం ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించి ఎస్ఐఆర్ ఉద్దేశం, విధివిధానాలు, ప్రయోజనాలు, ప్రజలు అనుసరించాల్సిన ప్రక్రియపై స్పష్టత కల్పించాలని కోరారు. దీనివల్ల ప్రజలకు సరైన సమాచారం అందడమే కాకుండా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలులో మరింత భాగస్వామ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తాటిపర్తి విజయలక్ష్మి, నాయకులు వెంకటేశ్వరరావు, ఆనందరావు, తుమ్మ గంగాధర్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, కల్లెపెల్లి దుర్గయ్య, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మాజీపేటలో పల్లె దవాఖాన ప్రారంభం

జగిత్యాల, జూన్ 16 : జగిత్యాల జిల్లా ధర్మాజీపేట గ్రామంలో రూ.23 లక్షల నిధులతో చేపడుతున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖాన)ను ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పల్లె దవాఖానలను ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచ్ గంగారెడ్డి, చైర్మన్ ఏనుగు ముత్యం రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి, డీఈ మిలింద్, బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి, మండల నాయకులు కోల శ్రీనివాస్, రవీందర్‌రావు, మోర హన్మాండ్లు, సంధ్యారాణి, సురేందర్ నాయక్, అచ్యుతరావు, ఏనుగు మల్లారెడ్డి, మారంపల్లి స్నేహలత-హరీష్, వెంకటేష్, పల్లికొండ గంగారాజం, మొకిద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# పహాణి పత్రాల్లో గుడాల అమ్మకాలు!

**మల్యాలలో వెలుగుచూసిన విచిత్ర ఘటన**

**చిత్తు కాగితాలుగా వ్యవసాయ రికార్డులు**

**విచారణకు గ్రామస్థుల డిమాండ్**

మల్యాల, జూన్ 16 : సాధారణంగా వ్యవసాయ భూముల యాజమాన్యం, సర్వే నంబర్లు, పంటల వివరాలు, భూ విస్తీర్ణం వంటి అంశాలను నమోదు చేసే పహాణి పత్రాలు ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో కీలకమైనవి. అలాంటి అధికారిక పత్రాలను గుడాల అమ్మకాల కోసం వినియోగించిన ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో చర్చనీయాంశంగా మారింది. స్థానికంగా ఓ దుకాణంలో గుడాలు విక్రయించిన సందర్భంగా, ఆ కాగితాలు ఎక్కడివని ఆరా తీయగా ఎక్కడో దొరికినట్లు సదరు



దుకాణాదారుడు పొంతనలేని సమాధానమిచ్చాడు. సాధారణంగా పహాణి పత్రాలు రెవెన్యూ శాఖ జారీ చేసే అధికారిక భూ రికార్డులు కావడంతో, అవి చిత్తు కాగితాల్లా ఎలా వినియోగంలోకి వచ్చాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారిక పత్రాలు ఎలా బయటకు వచ్చాయి? అవి నిజమైన పహాణి కాపీలా? లేక పాత రికార్డులా? అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూ రికార్డులను నిర్లక్ష్యంగా వినియోగిస్తున్నారా? అన్న కోణంలోనూ అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు. అధికారిక పత్రాల దుర్వినియోగం జరిగి ఉంటే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన మల్యాల మండలంలో చర్చకు దారితీయగా, ప్రభుత్వ రికార్డుల భద్రత, నిర్వహణ, వినియోగంపై మరింత అప్రమత్తత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# జగిత్యాల మున్సిపాలిటీలో మళ్లీ డీజిల్ స్కాం?

**నిధుల వినియోగంపై వివరాలెక్కడ?**

**కలెక్టర్‌కు హనుమండ్ల జయశ్రీ ఫిర్యాదు**

జగిత్యాల, జూన్ 16 : జగిత్యాల మున్సిపాలిటీలోని కొన్ని విభాగాల నిర్వహణ, నిధుల వినియోగం, సిబ్బంది నియామకాలపై పారదర్శకత లోపించిందని ఆరోపిస్తూ, వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కొత్త కౌన్సిల్ ఏర్పడిన తర్వాత 30-05-2026న జరిగిన ఎజెండాలో మార్చి, ఏప్రిల్ ఆదాయ-వ్యయ వివరాలు మాత్రమే ఇవ్వడం జరిగిందని, ఫిబ్రవరి నెల వివరాలు ఇవ్వలేదని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నందున ఫిబ్రవరి నెల ఆదాయ--వ్యయ వివరాలను నోటీసు బోర్డులో ఉంచి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. అదేవిధంగా శానిటేషన్ విభాగంలో డీజిల్ వ్యయాలు ప్రతి నెల పెంచి చూపుతున్నట్లు అనుమానాలు ఉన్నాయని, గతంలో కూడా డీజిల్ కుంభకోణంపై ఫిర్యాదులు చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఈసారి అలాంటి అక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీలో గ్రీన్ బడ్జెట్ కింద 'హరితహారం' కార్మికులను మెప్మా ద్వారా నియమించేందుకు తీసుకున్న నిర్ణయంపై కూడా ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. నియామకాల వివరాలు స్పష్టంగా లేకపోవడం, ఎంత మంది, ఎంత జీతం అన్న సమాచారం లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. టౌన్ లెవల్ ఫెడరేషన్ ద్వారా డ్రైవర్లు, లేబర్ల నియామకాలు చేపట్టే ప్రతిపాదనపై కూడా ఆమె సందేహాలు వ్యక్తం చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా టెండర్ విధానంలో పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని కోరారు. మున్సిపల్ ఆదాయం, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పూర్తి పారదర్శక ప్రక్రియ అమలు చేయాలని పట్టణ ప్రజల తరఫున కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు హనుమండ్ల జయశ్రీ తన లేఖలో పేర్కొన్నారు.

# ఎమ్మెల్యేను దించేదాకా నిద్రపోను: అర్వింద్

జగిత్యాల, జూన్ 16 : అమృత్2 పథకం కింద జగిత్యాలకు రూ.38.5 కోట్లు, రాయికల్‌కు రూ.15 కోట్లు మంజూరయ్యాయని, అయితే రాయికల్‌లో పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జగిత్యాల పర్యటనలో భాగంగా ఆయన మాట్లాడుతూ, రాయికల్ అమృత్ కాంట్రాక్టును సీఎం సన్నిహితుడికి చెందిన డమ్మీ కంపెనీకి అప్పగించారని ఆరోపించారు. కమిషన్ల కోసమే డమ్మీ కంపెనీలకు పనులు కట్టబెడుతున్నారని, సబ్ కాంట్రాక్టు ఇచ్చినప్పటికీ రాయికల్‌లో ఇప్పటివరకు ఒక్క పని కూడా ప్రారంభం కాలేదని విమర్శించారు. అమృత్ పథకం నిధులు ఎటు వెళ్తున్నాయో ప్రజలకు ప్రభుత్వం



సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని కోట్ల రూపాయల లావాదేవీల కోసం ఒక ప్రైవేటు వ్యాపారికి అప్పగించారని ఆరోపించిన ఆయన, ఈ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారాయని వ్యాఖ్యానించారు. స్థానిక ఎమ్మెల్యే కూడా ఇందులో భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. చల్గల్ గ్రామంలో ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంటనే కేంద్రీయ విద్యాలయానికి కేటాయించాలని ఎంపీ అర్వింద్ కోరారు. జగిత్యాల అభివృద్ధి అంశాల్లో ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తానని, ప్రస్తుత ఎమ్మెల్యేకు 'మాజీ ఎమ్మెల్యే' అనే పేరు వచ్చే వరకు తాను నిద్రపోనని వ్యాఖ్యానించారు.




# విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

**బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్ ప్రారంభోత్సవంలో మోతె శ్రీలత శోభన్ రెడ్డి**

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 16 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "బడిబాట" కార్యక్రమంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న "బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్" పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జామా ఉస్మానియాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి హాజరై విద్యార్థులకు అల్పాహారం, పాలు పంపిణీ చేసి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ఆరోగ్యం మరియు విద్యా ప్రమాణాల పెంపు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. చిన్నారులు పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా చదువుకోవడానికి ఈ అల్పాహార పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా, విద్యార్థులే దేశ భవిష్యత్తు అని పేర్కొంటూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అవసరమైతే కాంగ్రెస్‌లో చేరుతా

**ఎంపీ అర్వింద్‌కు సంజయ్ కౌంటర్**

రాయికల్, జూన్ 16 : అభివృద్ధి కార్యక్రమానికి హాజరై రాజకీయ అంశాలు ప్రస్తావించి, సభ మధ్యలో వెళ్లిపోవడం సరైన పద్ధతి కాదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజాసేవే ముఖ్యమని పేర్కొన్నారు. మంగళవారం రాయికల్ మండలం ధర్మాజిపేటలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పల్లె దవాఖాన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.3 లక్షలు మాత్రమే ఇచ్చిందని పేర్కొన్నారు. అనంతరం సభ నుంచి వెళ్లిపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రం విడుదల చేసే నిధులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే పన్నుల ద్వారానే సమకూరుతాయని అన్నారు. రాష్ట్రాల నుంచి పన్నులు వెళ్లకపోతే కేంద్రానికి నిధులు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. తాను కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని, కాంగ్రెస్ ఎమ్మెల్యేనని విమర్శిస్తున్నారని, అవసరమైతే కాంగ్రెస్ సభ్యత్వం కూడా తీసుకుంటానంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రాలకు మరింత న్యాయమైన వాటా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ కోసం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు రెండు గంటలపాటు వేచి ఉన్నారని, వారి వినతులను స్వీకరించకుండా వెళ్లిపోవడం బాధాకరమన్నారు. బీజేపీ నాయకులు రెచ్చగొట్టేలా నినాదాలు చేశారని ఆరోపించారు. వడ్లు, మక్కల కొనుగోలు విషయంలో కేంద్రం విఫలమైందని, రైతు సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం యూరియా కోత విధించడం వల్లే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి 14 పల్లె దవాఖానలు మంజూరు చేశామని, ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రరీ చైర్మన్ సంగనబట్ల దినేష్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# కొండగట్టు అంజన్న సేవలో ఏపీ ఎమ్మెల్సీ రహుల్లా

మల్యాల, జూన్ 16 : మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని విజయవాడ ఎమ్మెల్సీ ఎండి రహుల్ల మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ రహుల్ల స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి దర్శన భాగ్యం పొందారు. ఆలయ ప్రధాన అర్చకులు జితేందర్ స్వామి వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన టెంపుల్ సూపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్‌తో పాటు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.




# ఎరువులు, విత్తనాలపై భరోసా ఏదీ?

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నైరుతి ప్రవేశించినా ఇప్పటికీ ఆశించిన వర్షాలు పడడం లేదు. రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నా, అప్పుడే తొందరపడవద్దని, విత్తనాలు వేసుకోవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరి స్తున్నారు. మరోవైపు సన్నరకాలను, డిమాండ్ ఉన్న వంగడాలనే వేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా సూచించింది. నిజానికి ఏ పంటలు వేయాలో రైతులకు సూచించి, అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను సరఫరా చేసే విధానం అవలంబించి ఉంటే ఇవాళ వ్యవసాయ సంక్షోభం ఉండేది కాదు.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నైరుతి ప్రవేశించినా ఇప్పటికీ ఆశించిన వర్షాలు పడడం లేదు. రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నా, అప్పుడే తొందరపడవద్దని, విత్తనాలు వేసుకోవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు సన్నరకాలను, డిమాండ్ ఉన్న వంగడాలనే వేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా సూచించింది. నిజానికి ఏ పంటలు వేయాలో రైతులకు సూచించి, అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను సరఫరా చేసే విధా నం అవలంబించి ఉంటే ఇవాళ వ్యవసాయ సంక్షోభం ఉండేది కాదు. ఏ భూములు ఏ పంటలకు అనువో ఇన్నేళ్లయినా గుర్తించి, రైతులను వ్యవసాయానికి అనుగుణంగా సన్నదం చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. మరోవైపు ఎల్‌నినో భయ పెడుతున్న వేళ రైతులకు తగిన సూచనలు, సలహాలు చేయడం లేదు. ప్రణాళికలు సిద్ధం చేయడం లేదు. అందు ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఏటా రైతులు బలవుతున్నారు. నీటి లభ్యత, భూముల వివరాల ఆధారంగా పంటలు పండించే పద్ధతి కానరావడం లేదు. రైతులు డా తమకు తెలిసిన వరిని పండిస్తున్నారు. డిమాండ్ ఉన్న పంటలు పండిం చి, ఆర్థికంగా ఎదగడం లేదు. కాగా ఈ ఏడాది సాధారణ వర్ష పాతం కంటే తక్కువ నమోదవుతుందని ఐఎండి. అంచనా వేసిం ది. ఎల్‌నినో రాష్ట్రంపై ప్రభావం చూపుతుందని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వెల్లడించాయి. అందుకు తగ్గ ప్రణాళికలతో సన్న ద్ధం కావాలని ఆదేశించినా., అదేమిటో రైతులకు బోధపడడం లేదు. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయం సాగేది ఖరీఫ్‌లోనే. నిరుడు పంటల సరళిలో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ మొత్తంగా విస్తీర్ణ పరంగా సాధారణ సాగు నమోదైంది. అయితే వర్షాభావం, అకాల, భారీ వర్షాలు, తుపాన్లతో పంట నష్టాలు సంభవించి అన్నదాతలను ఆర్థికంగా నష్టపరిచాయి. కీలక సమ యంలో వర్షాల్లేక కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం వాటిల్లిం ది. ఖరీఫ్‌లో డ్రై స్పెల్ వందల మండలాలల్లో తిష్ట వేసినా ప్రభు త్వం వలం పెద్దగా పట్టించుకోలేదు. ఎపిలో రబీలో దుర్భిక్ష పరిస్థితులు విస్తరించగా 51మండలాల్లో కరువును ప్రకటించి చేతులు దులు పుకుంది. ప్రకటించిన మండలాల్లో డా రైతులకు ఎలాంటి ప్రత్యేక సహాయమూ చేయలేదు. ఇంకో వైపు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో రైతులకు ఏ పంట ధర రాక, ధర ఇప్పిం చేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టక రైతులు నష్టాలను చవిచూశారు. కేంద్రం కూడా ఒక పద్ధతి ప్రకటించడం లేదు. ఎల్‌నినోతో ఏ పంటలు వేసుకోవాలో, దేనికి మద్దతు ఇస్తరో తెలి యడం లేదు. తెలంగాణ లో మక్కజొన్న, జొన్న పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపో యారు. వాటికి గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లారు. పంటలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తి గా విఫలం అయ్యింది. ఖరీఫ్ ముంచుకొస్తున్నా, నేటికీ సక్రమం గా ధాన్యం సేకరణ జరగలేదు. ఇకపోతే ఈఖరీఫ్‌లో సేద్యానికి రైతులకు అత్యవసరం గా కావాల్సినవి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, పెట్టుబడులు. రైతులకు అవస రమైన మొత్తం విత్తనాల్లో ప్రభుత్వం రాయితీపై అందించేవి 30 శాత మే. అవీ కొన్ని పంటల పరిమితం. ఎపిలో వేరుశనగ విత్తనాల పంపి ణీ ఏర్పాట్లు ఆలస్యమ య్యాయి. వరి, కందులు, ఇతర అపరాలూ అంతే. పచ్చిరొట్ట పంట విత్తనాలిస్తున్నామంటున్నా బహిరంగ మార్కె ట్ ధరలే రాయితీ విత్తనాల నిర్ణయించారు. రాయితీ విత్తనాల పంపిణీ యావత్తూ అదే తీరు. సీజన్ ప్రారంభానికి ముందు నుంచీ ంద్రం ఆదేశాలతో యూరి యా, డిఎపి వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లని, కార్డులని, పైలెట్ ప్రాజెక్టులని ప్రహసనం లేవనెత్తి రైతుల్లో, ముఖ్యంగా కౌలు రైతుల్లో గుబులు రేపింది. నిరుడు ప్రభుత్వ ముందుచూపు లేక యూరియా దొరక్క రైతులు ఇబ్బంది పడగా, ఆ పరిస్థితులే ఇం కా కొనసాగుతున్నాయి. నకిలీ, కల్తీ, అనుమతుల్లేని పత్తి విత్తనాల బెడద ఉండనే ఉంది. ంద్రం పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు, ఎరువుల ధరలు రైతాంగాన్ని కుంగదీస్తున్నాయి. తొలకరి సం తాలతో రైతన్నలు సాగుకు సిద్ధమయ్యేందుకు కావాల్సిన పెట్టుబడు లు సమర్చడంపై ప్రభుత్వంలో నెలకొన్న స్తబ్దత ఆందోళన కలిగిస్తుం ది. ఎపిలో కౌలు రైతులకు రెండేళ్లల్లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఈసారైనా ఇస్తారో లేదో తెలీదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ఊసే లేదు. నిరుడు అక్టోబర్‌లో మొంథా తుపాన్ రాగా నేటికీ రైతుల కు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. పంటల బీమా సొమ్ము లేదు. కరువు మండలాల్లో రైతులకు పరిహారం లేదు. రెండేళ్లల్లో రైతులకు సున్నా వడ్డీ రూపాయి డా విడుదల చేయలేదు. వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలు పుస్తకాల పరిమితం అయ్యింది. ప్రాజెక్టుల కింద నీటి విడుదలకు షెడ్యూల్ ఇచ్చినా ఎల్‌నినో, వర్షాభావాలను పరిగణనలోకి తీసుకో వాలి. సేద్యం సజావుగా సాగాలంటే రైతుల అవసరాలన్నింటినీ తీర్చేందుకు ప్రభు త్వంలో చిత్తశుద్ధి, ముందుచూపు, సన్న ద్ధత అవస రం. ఇకపోతే తెలంగాణలో ప్రభుత్వం తీరు సక్రమంగా కనిపించడం లేదు. దేశీయం గానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్ లోనూ డిమాండ్ ఉన్న 8 రకాల మేలైన వరి వంగడాలనే సాగు చేసే లా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిం చాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్త లు సూచిం చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ ఎనిమిది రకాల వంగడాలను సాగు చేయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు మంత్రులకు సూచించారు. ఈ వంగడాలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర లభించే అవకాశం ఉందన్నారు.

తొలకరి సంతాలతో రైతన్నలు సాగుకు సిద్ధమయ్యేందుకు కావాల్సిన పెట్టుబడులు సమర్చడంపై ప్రభుత్వంలో నెలకొన్న స్తబ్దత ఆందోళన కలిగిస్తుంది. ఎపిలో కౌలు రైతులకు రెండేళ్లల్లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఈసారైనా ఇస్తారో లేదో తెలీదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ఊసే లేదు. నిరుడు అక్టోబర్‌లో మొంథా తుపాన్ రాగా నేటికీ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు.

EDITORIAL



# ఆదర్శ జిల్లాగా యాదాద్రి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- డిజిటల్ ఆరోగ్య సేవల విస్తరణకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశం

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి :** ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలులో తెలంగాణ రాష్ట్రం నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాను ఆదర్శ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని సందర్శించి ఆరోగ్య సంస్థలు, వైద్య సిబ్బంది నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు, మెడికల్ షాపుల నమోదును మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. డిజిటల్ ఆరోగ్య సేవలను విస్తృత స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆరోగ్య రికార్డుల డిజిటలీకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎం. మనోహర్, డిప్యూటీ వైద్య ఆరోగ్య అధికారులు, వైద్య సంఘాల ప్రతినిధులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యూరియా పంపిణీలో పారదర్శకత పాటించాలి

- యూరియా కేంద్రాల్లో ఎస్పీతో కలిసి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్
- రైతులకు సకాలంలో ఎరువుల సరఫరాపై అధికారులకు ఆదేశాలు



**ప్రజానావ, నాగర్‌కర్నూల్ :** ఖరీఫ్ సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన యూరియా ఎరువులు సకాలంలో, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌తో కలిసి పట్టణంలోని పలు యూరియా పంపిణీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మన గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), ప్రైవేట్ ఎరువుల విక్రయ కేంద్రాలను సందర్శించి యూరియా నిల్వలు, పంపిణీ విధానాన్ని పరిశీలించారు. గ్రోమోర్ కేంద్రంలో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు, రాబోయే రోజుల్లో రైతుల అవసరాలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. దుకాణాల్లో నిర్వహిస్తున్న స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, మున్సిపల్ అనుమతులు, నానో యూరియా, నానో డీఏపీ వంటి ఉత్పత్తుల లభ్యతపై కూడా వివరాలు సేకరించారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతులకు నిరంతరాయంగా ఎరువులు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పీఏసీఎస్ విక్రయ కేంద్రాన్ని సందర్శించి, ఆన్‌లైన్ విధానం ద్వారా జరుగుతున్న యూరియా పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. రైతుల ఆధార్ ధ్రువీకరణ, బయోమెట్రిక్ నమోదు, పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాల ద్వారా జరుగుతున్న విక్రయాల విధానాన్ని పరిశీలించి, ప్రతి రైతుకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విక్రయాల విషయంలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని, కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమ నిల్వలు చేయడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల నిల్వలు, సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. యూరియా పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తనిఖీల సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్, జిల్లా సహకార అధికారి రఘునాథరావు, ఆర్డీవో సురేష్‌బాబు, డివిజన్ వ్యవసాయ అధికారి పూర్ణచంద్రారెడ్డి, తహసీల్దార్ తబితారాణి, సంబంధిత శాఖల అధికారులు, పీఏసీఎస్ ప్రతినిధులు, ఎరువుల విక్రయ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# కళాకారుల సేవలు అభినందనీయం

**మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టీ హరీశ్ రావు**

**ప్రజానావ, సిద్దిపేట :** తెలంగాణ ఉద్యమ చరిత్ర, అమరవీరుల త్యాగాలను నేటి తరానికి చేరవేస్తూ కళాకారులు చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టీ హరీశ్ రావు అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట మూవీ ఆర్టిస్ట్స్ అండ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "తెలంగాణ నినాదం – అమరవీరుల త్యాగాలు" నాటక ప్రదర్శన విజయవంతం కావడం పట్ల హరీష్ రావు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవ పోరాట గాథను, అమరవీరుల త్యాగాలను ప్రజలకు చేరవేసేలా నాటకాన్ని రూపకల్పన చేసి ప్రదర్శించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలను ప్రజలకు చేరవేసే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. కళారంగంలో మరింతగా రాణించి సిద్దిపేటకు గుర్తింపు తీసుకురావాలని కళాకారులకు ఆకాంక్షించారు.



ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ నాటకానికి ప్రజల నుంచి విశే ష స్పందన లభించిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల యువ కళాకారులకు శిక్షణ అందిస్తూ వారి ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని చెప్పారు. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదా యాల పరిరక్షణతో పాటు సామాజిక అవగాహన కల్పించే నాటకాలు, షార్ట్ ఫిల్మ్స్ రూపకల్పనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో ఉన్న యువ కళాకారులు, నటులు, సాంకేతిక నిపుణులకు ప్రభుత్వ కార్యక్రమాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. కళను కేవలం వినోద సాధనంగా కాకుండా సమాజ మార్పుకు శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగించడమే తమ లక్ష్యమని అసోసియేషన్ అధ్యక్షుడు చిరంజీవి కర్రోల్ల పేర్కొన్నారు.

# మైనర్ బాలికకు న్యాయం చేయాలి

**ప్రజానావ, కారేపల్లి :** ఖమ్మం నగరంలో లైంగిక దాడికి గురైన మైనర్ బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 12 ఏళ్ల బాలికపై జరిగిన ఘటన అత్యంత అమానుషమని పేర్కొన్న ఆమె, నిందితుడిపై వేగవంతమైన విచారణ జరిపి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు, బాలికల భద్రతకు సంబం ధించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సామా జిక, ఆర్థిక లేదా రాజకీయ ప్రభావాలతో నింది తులు శిక్షల నుంచి తప్పించుకునే పరిస్థితులకు అడ్డుకట్ట వేయాలని ఉమావతి పేర్కొన్నారు. ఖమ్మం ఘటనలో పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించి, నిందితుడికి కఠిన శిక్ష విధించడం ద్వారా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపిం చుకోవాలని ఆమె అన్నారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకురాళ్లు సురపాక ధనలక్ష్మి, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్
- పెండింగ్ అంశాల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు
- ప్రాజెక్టుల పురోగతిపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో సమీక్ష

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో అమలవుతున్న వివిధ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, భూసేకరణ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్, సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టు, పులుసుబొంత ప్రాజెక్టు, సింగభూపాలెం ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పెండింగ్ అనుమతులు, సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా భూసేకరణ పురోగతి, భూ సర్వే పనులు, వివిధ ప్యాకేజీలకు సంబంధించిన పెండింగ్ అంశాలు, కోర్టు కేసులు, అనుమతుల స్థితిగతులను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం లేకుండా చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ, వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు వ్యవహరించాలని సూచించారు. భూ సర్వే పనులను వేగవంతం చేసేందుకు అవసరమైతే అదనపు సర్వేయర్ల నియామకానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే భూసేకరణకు సంబంధించిన కోర్టు కేసులు, వివిధ అనుమతుల అంశాలను ప్రత్యేక దృష్టితో పరిశీలించి త్వరితగతిన పరిష్కరిం చాలని సూచించారు. రెవెన్యూ, ఇరిగేషన్, భూసేకరణ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టుల అమలుకు అవసరమైన భూమి సేకరణను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు కీలకమని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, డీఆర్వో పద్మావతి, ఆర్డీవో మధు, సంబంధిత మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల హక్కులను పరిరక్షించాలి

**పీసీసీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

**ప్రజానావ, సంగారెడ్డి :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించాలని పీసీసీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సంగారెడ్డిలో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా ప్రతి బూత్‌లో ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, బీజేపీ విధానాలపై విమర్శలు గుప్పించిన ఆయన, ప్రజాస్వామ్య వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించరాదన్నారు. ప్రజల తీర్పే అంతిమమని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**ప్రజానావ, సూర్యాపేట :** అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హులు, నకిలీ ఓట్లను గుర్తించి తొలగించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. 24 సంవత్సరాల అనంతరం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వ హించాలని ఆయన సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఓటరు ప్రత్యేక సవరణ డ్రైవ్‌కు సంబంధించిన విధి విధానాలను వివరించారు. జూన్ 25 నుంచి నెల రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన ఫారాలను అందజేస్తారని, ఈ ప్రక్రియ మొత్తం బీఎల్ఓ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయబడుతుందని చెప్పారు. ఈ సర్వేలో భాగంగా ఇప్పటికే నమోదైన ఓటర్ల వివరాలను ధృవీకరించడంతో పాటు, పేర్లు, చిరునామాలు, కుటుంబ వివరాల్లో ఉన్న పొరపాట్లను సవరించే అవకాశం ఉంటుందని తెలిపారు. మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, తగిన ఆధారాలు పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని వివరించారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ చిరునామా మార్పు కోసం ఫామ్–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. తుది ఓటరు జాబితా ప్రకటించే నాటికి అన్ని ప్రక్రియలు పూర్తి కావాలని, ఎలాంటి పొరపాట్లు లేని సమగ్ర ఓటరు జాబితా తయారీకి బీఎల్‌ఓలు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, ఆర్డీవోలు వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్లు వి. రమేష్, పి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు, సూపర్వైజర్లు, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో భూ వివాదాల పరిష్కారం

- కలెక్టర్ దివాకర్ టీఎస్
- అటవీ–రెవెన్యూ సరిహద్దు సమస్యలపై ఉన్నతస్థాయి సమీక్ష
- జాయింట్ సర్వేలతో వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశం




**ప్రజానావ, ఖమ్మం :** అటవీ, రెవెన్యూ శాఖల సరిహద్దు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్‌తో కలిసి అటవీ–రెవెన్యూ భూముల సరిహద్దు సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా కొనసాగుతున్న అటవీ–రెవెన్యూ భూ సరిహద్దు వివాదాల పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణ ప్రారంభించినట్లు తెలిపారు. ఇరు శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో సీఏ ల్యాండ్స్ మ్యూటేషన్స్, ఫారెస్ట్–రెవెన్యూ సరి హద్దు వివాదాలు, ఆర్వోఎఫ్ఆర్ పట్టా భూము లకు సంబంధించిన సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. జాయింట్ సర్వే చేపట్టే ముందు అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా సమావేశమై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించుకో వాలని ఆదేశించారు. ఆ మార్గదర్శకాల ప్రకా రం సర్వేలు పూర్తి చేసి వివాదాలను పరిష్క రించాలని సూచించారు. అర్హులైన ఆర్వోఎఫ్ ఆర్ పట్టాదారులకు బోర్ల మంజూరుకు అవస రమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 2008, 2021–22 సంవత్స రాల్లో పంపిణీ చేసిన ఆర్వోఎఫ్ఆర్ పట్టా భూముల్లో తలెత్తిన సమస్యలపై క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. అటవీ సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్న కలెక్టర్, అటవీ భూముల్లో కొత్త ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అటవీ సంపద పరిరక్షణతో పాటు భూ వివాదాల పరిష్కారంలో అధికారు లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, డీఆర్వో సీహెచ్ రామ్మూర్తి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ మండలాల ఎఫ్ఆర్వోలు, తహసీల్దార్లు, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల బస్ సౌకర్యం పునరుద్ధరించాలి

- నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు చేస్తాం : ఏఐటీయూసీ



ప్రజానావ, రామగుండం : సింగరేణి స్కూల్‌లో చదువుతున్న కార్మికుల పిల్లలకు అందిస్తున్న బస్ సౌకర్యాన్ని ఎత్తివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన రవాణా సౌకర్యం కల్పించడం యాజమాన్యం బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. బస్ సౌకర్యాన్ని నిలిపివేయడం వల్ల కార్మి కుల పిల్లలు పాఠశాలకు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బస్ సౌకర్యాన్ని యథావిధిగా కొనసాగించాలని, కార్మిక కుటుంబాల ఇబ్బందులను గుర్తించి యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని రంగు శ్రీను హెచ్చరించారు.

## జనగామ ఆర్వో ప్లాంట్‌ను పునరుద్ధరించాలి

- సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొడుపునూరి రమేశ్ కుమార్



ప్రజానావ, రామగుండం : సింగరేణి ఆర్జీ–1 ప్రభావిత ప్రాంతమైన జనగామ డివిజన్ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను వెంటనే మరమ్మతులు చేసి ప్రారంభించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొడుపునూరి రమేశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి ఆర్జీ–1 యాజమాన్యం కొన్ని సంవత్సరాల క్రితం లక్షలాది రూపాయల వ్యయంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. అయితే ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించకముందే అది శిథిలావస్థకు చేరుకోవడం బాధాకరమన్నారు. సీఎస్ఆర్ నిధుల కింద ప్రభావిత ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని సింగరేణి యాజమాన్యం ప్రకటిస్తున్నప్పటికీ, ప్రజలకు నేరుగా ఉపయోగపడే మౌలిక సదుపాయాల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోందని విమర్శించారు. ఆర్వో ప్లాంట్ పనికిరాని స్థితికి చేరుకోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానిక ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. జనగామ డివిజన్ ప్రజలకు సురక్షితమైన, శుద్ధి చేసిన తాగునీరు అందేలా వెంటనే నిధులు కేటాయించి ప్లాంట్‌కు అవసరమైన మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

Singareni news

## ముున్సిపాలిటీలో లెక్కలపై అనుమానాలు

- కలెక్టర్‌కు మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు
- ఆదాయం – వ్యయాల వివరాల వెల్లడిలో లోపాలున్నాయని ఆరోపణ

ప్రజానావ, జగిత్యాల : జజగిత్యాల మున్సిపాలిటీలో ఆదాయం–వ్యయాల లెక్కలు, డీజిల్ ఖర్చులు, హరితహారం కార్మికుల నియామకాల వ్యవహారంలో పారదర్శకత పాటించాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొత్త కౌన్సిల్ ఏర్పాటైన అనంతరం మే 30న నిర్వహించిన సమావేశంలో మార్చి, ఏప్రిల్ నెలల ఆదాయం–వ్యయాల వివరాలు మాత్రమే సభ్యులకు అందించారని, ఫిబ్రవరి నెలకు సంబంధించిన లెక్కలను వెల్లడించలేదని ఆమె పేర్కొన్నారు.ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా ఫిబ్రవరి నెల ఆదాయం–వ్యయాల వివరాలను కూడా మున్సిపాలిటీ నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలని కోరారు. సానిటేషన్ విభాగంలో డీజిల్ వ్యయం నెల నెలా పెరుగుతున్నట్లు కనిపిస్తోందని, గతంలోనూ డీజిల్ ఖర్చులపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో దీనిపై సమగ్ర విచారణ చేపట్టి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా గ్రీన్ బడ్జెట్ కింద హరితహారం కార్మికులను మెప్మా ఆధ్వర్యంలోని టీఎల్ఎఫ్ ద్వారా తాత్కాలికంగా నియమించేందుకు ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, కార్మికుల సంఖ్య, వేతనాలు తదితర పూర్తి వివరాలు ఎజెండాలో పొందుపరచలేదని తెలిపారు. గతంలో కార్మిక నియామకాల విషయంలో ఆరోపణలు వచ్చినందున టీఎల్ఎఫ్ ద్వారా కాకుండా టెండర్ విధానంలో పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని సూచించారు. దీంతో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండటంతో పాటు మున్సిపాలిటీకి ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

## గ్రామీణ వైద్యులపై దాడులు అరికట్టాలి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- మానకొండూరులో ఆర్ఎంపీ, పీఎంపీలతో 'చాయ్ పే చర్చ' కార్యక్రమం
- గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆర్ఎంపీ, పీఎంపీలదే కీలక పాత్ర



ప్రజానావ, తిమ్మాపూర్ : గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆర్ఎంపీ, పీఎంపీలు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారిలేని గ్రామీణ సమాజాన్ని ఊహించలేమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని, అలాంటి ఘటనలను ప్రభుత్వం కఠినంగా అరికట్టాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తైన సందర్భంగా మంగళవారం మానకొండూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆర్ఎంపీ, పీఎంపీలతో 'చాయ్ పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి చర్యలను వివరించారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు తమకు ఎదురవుతున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కొందరు కావాలనే తమపై అకారణంగా దాడులు చేస్తున్నారని, అలాంటి ఘటనలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మానకొండూరు నియోజకవర్గం లో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్‌కు సొంత భవనం లేదని, సంఘ భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో ప్రజలకు కుటుంబ సభ్యుల్లా వైద్య సేవలు అందిస్తున్నది ఆర్ఎంపీ, పీఎంపీలే నని పేర్కొన్నారు. వారు సేవలు నిలిపి వేస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అందువల్ల వారి సేవలను గుర్తించి ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి కలిగిన నాయకుడని, భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. డిజిటల్ లావాదేవీల విస్తరణ, జన్‌ధన్ ఖాతాల ప్రారంభం వంటి కార్యక్రమాలు ఇందుకు ఉదాహరణలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నిధులు ఎలాంటి అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయని చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గత ఏడు సంవత్సరాల్లో రూ.22 వేల కోట్లకు పైగా అభివృద్ధి నిధులు వచ్చినట్లు తెలిపారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. మానకొం డూరులో ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమ భవనం నిర్మాణానికి స్థలం చూపిస్తే ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

## పోడు భూముల వద్ద మళ్లీ ఉద్రిక్తత

- రైతులను అడ్డుకున్న అటవీ శాఖ
- ఆగ్రహించిన రైతులు




ప్రజానావ, ఆసిఫాబాద్ : మండలంలోని సూర్దాపూర్–ధనోర గ్రామాల మధ్య ఉన్న పోడు భూముల వివాదం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. తమ సాగు భూముల్లో విత్తనాలు నాటేందుకు వెళ్లిన పోడు రైతులను అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం సూర్దాపూర్ గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ సాగు భూముల్లో విత్తనాలు నాటేందుకు వెళ్లగా అటవీ శాఖ సిబ్బంది వారిని నిలువరించారు. దీంతో ఆగ్రహించిన రైతులు మంగళవారం పెద్ద సంఖ్యలో తమ చేన్ల వద్దకు చేరుకుని సాగు పనులు ప్రారంభించేందుకు ప్రయత్నించారు. అయితే ముందస్తుగా ప్రధాన రహదారి వద్ద మోహరించిన అటవీ శాఖ అధికారులు వారిని అడ్డుకున్నారు. దీంతో రైతులు నిరసనకు దిగారు. అటవీ శాఖ వాహనాలు చేన్లలోకి వెళ్లకుండా రహదారిపై రాళ్లు పేర్చి నిరోధించారు. రైతులు, అటవీ అధికారుల మధ్య కొంత సేపు వాగ్వాదం చోటుచేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న వాంకిడి సీఐ వేణుగోపాల్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలతో మాట్లాడారు. శాంతియుతంగా వ్యవహరించాలని సూచిస్తూ, సమస్య పరిష్కారం కోసం జిల్లా అటవీ శాఖ అధికారులను కలిసి తమ వాదన వినిపించాలని రైతులకు సూచించారు. అనంతరం సూర్దాపూర్ గ్రామానికి చెందిన రైతులు జిల్లా కేంద్రానికి చేరుకుని ఎమ్మెల్యే కోవ లక్ష్మి తో పాటు జిల్లా అటవీ శాఖ అధికారిని, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రాలు అందజేశారు. గత 25 ఏళ్లుగా సాగు చేస్తున్న భూముల్లో వ్యవసాయ పనులు చేసేందుకు అటవీ శాఖ అడ్డుకోవడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి సాగు హక్కులు కల్పించాలని కోరారు. ఈ ఘటనతో సూర్దాపూర్–ధనోర గ్రామాల మధ్య పోడు భూముల వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అధికారులు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, ఏఎస్సై తో పాటు పోలీసు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### అటవీ భూములను స్వాధీనం చేసుకుంటాం : ఎఫ్ఆర్ఓ మజారుద్దీన్

కెరమెరి రేంజ్ పరిధిలోని సూర్దాపూర్–ధనోర గ్రామాల మధ్య సుమారు 100 హెక్టార్ల అటవీ భూమిలో అక్రమంగా పోడు సాగు జరుగుతోందని కెరమెరి ఫారెస్ట్ రేంజ్ అధికారి మజారుద్దీన్ తెలిపారు. అటవీ శాఖ రికార్డుల ప్రకారం ఆ భూములు అటవీ పరిధిలోనే ఉన్నాయని, సాగు చేస్తున్న రైతుల వద్ద ఎలాంటి అటవీ హక్కుల పత్రాలు లేదా చట్టబద్ధ ఆధారాలు లేవని పేర్కొన్నారు. అటవీ భూముల్లో సాగు చేయడం నిబంధనలకు విరుద్ధమని, చట్టాల ప్రకారం ఆ భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అటవీ సంపద పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం, అటవీ పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు అటవీ శాఖ అధికారులకు సహకరించాలని, తమ హక్కులకు సంబంధించిన ఆధారాలు ఉన్నవారు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## పరస్పర అంగీకారంతో కేసులు పరిష్కారం

- రాజీమార్గమే రాజా మార్గం
- బార్ అసోసియేషన్‌ల సమన్వయ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ

ప్రజానావ, సిరిసిల్ల : పరస్పర అంగీకారంతోనే కేసులు పరిష్కారం అవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి. నీరజ అన్నారు. రాజీ మార్గమే చక్కటి రాజ మార్గమని పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కోర్టు సముదాయంలో సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టు కేసుల్లో ఇరుపక్షాలు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని సూచించారు. కేసులు పరస్పర అంగీకారంతో పరిష్కారమవడం ద్వారా ప్రజలు దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందుతారని తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులు లోక్ అదాలత్‌లో మరిన్ని కేసుల పరిష్కానికి తాము సహకరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి.పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల, ఇన్చార్జి కార్యదర్శి, రాధిక జైస్వాల్ డిఎల్ఎస్ఏ పి.లక్ష్మణాచారి, జూనియర్ సివిల్ జడ్జి కుమారి మేఘన, సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు ఆవునూరి రమాకాంతరావు, పిట్టల మనోహర్, న్యాయవాదులు పాల్గొన్నారు.




## సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ప్రజానావ, తిమ్మాపూర్ : మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, అభివృద్ధి సంబంధిత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వినతిపత్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుత్, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ ఫిర్యాదులను సమర్పించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

## గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్
- ధరూర్‌లో మహిళా సంఘ భవనానికి భూమిపూజ
- రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం



ప్రజానావ, జగిత్యాల : గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మదర్ థెరిసా మహిళా సంఘం నూతన భవనానికి మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం రూ.15 లక్షలతో చేపట్టనున్న మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అండగా నిలిచేలా రెండు ఎకరాల వరకు రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. మొదటి విడతతో పాటు రెండో విడతలో కూడా అర్హులకు ఇళ్ల మంజూరు కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం, యూనిఫాంల పంపిణీ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. ఈ కేంద్రం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. అదేవిధంగా రూ.6 కోట్లతో ఏసీటీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి కల్పించడం ద్వారా విద్యార్థినుల కు మరింత మెరుగైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. రామాలయం–పోతారం రహదారి అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ చైర్మన్ కొలుగురి దామోదర్ రావు, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రామ్మోహన్, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులోకి ఉంటూ సమర్థవంతమైన సేవలందించాలి

ఇల్లంతకుంట స్టేషన్ ఆకస్మిక తనిఖీలో ఎస్పీ మహేష్ బీ. గీతే



ప్రజానావ, సిరిసిల్ల : ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా మంగళవారం రోజు ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, రౌడీషీటర్లు అలాగే నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం దగ్గర ఉండాలని, పట్టణాల్లో, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎస్పీ వెంట రూరల్ సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

వీర్నపల్లి సబ్ స్టేషన్ తనిఖీలో సిరిసిల్ల సర్కిల్ ఎస్ఈ వేణుమాధవ్

ప్రజానావ, సిరిసిల్ల : రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని ఎన్పీడీసీఎల్ రాజన్న సిరిసిల్ల జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ టి వేణుమాధవ్ ఆదేశించారు. మంగళవారం సెస్ పరిధిలోని వీర్నపల్లి సెక్షన్ లోని అడవిపదిర సబ్ స్టేషన్‌ను సూపరింటెండెంట్ ఇంజనీర్ ణుమాధవ్ తనిఖీ చేశారు. అనంతరం వీర్నపల్లి ఎల్లారెడ్డిపేట సెక్షన్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సిబ్బందిని వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం మద్దిమల్ల నూతన సబ్ స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. తర్వాత కోనరావుపేట్ మండలంలోని మరిమడ్ల నూతన సబ్ స్టేషన్ నిర్మాణాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఈ టెక్నికల్ ఎన్. అంజయ్య, ఏడిఈ గంభీరావుపేట్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్

- జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి
- వడ్ల కొనుగోళ్లలో ఘోర వైఫల్యమని విమర్శ
- ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు

ప్రజానావ, జనగామ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ సమస్యలను పట్టించుకోవడం లేదని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి* విమర్శించారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని రేణుక గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వడ్ల కొనుగోళ్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా రైతులు ధాన్యం విక్రయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గన్నీ బ్యాగుల కొరత, లారీల లభ్యత లేకపోవడం వల్ల రైతులు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో రైస్ మిల్లులు ధాన్యం స్వీకరించకపోవడంతో రైతుల ఇబ్బందులు మరింత పెరిగాయని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్, సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ రంగానికి పూర్తి స్థాయిలో అండగా నిలిచిన ప్రభుత్వం బీఆర్ఎస్‌దేనని పేర్కొన్నారు. అదేవిధంగా, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందని ఆరోపిస్తూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో ప్రారంభం కానున్న బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించాలని, ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొని పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.

## నేడు హనుమకొండలో పవన్ కల్యాణ్ పర్యటన



ప్రజానావ, హనుమకొండ : ఏపీ డిప్యూటీ సీఎం సినీ నటుడు పవన్ కల్యాణ్ బుధవారం హనుమకొండలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి బయల్దేరనున్న ఆయన ఉదయం హనుమకొండలోని హనుమాన్‌నగర్ ప్రాంతంలో నివసిస్తున్న నిరంజన్ అనే బాలుడిని పరామర్శించనున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నారు. ఆలయ దర్శనం అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో హనుమకొండలో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# ఒకరిపై ఒకరికి అపనమ్మకం

- నమ్మకం లేకపోవడమే అసలు సమస్య
- ప్రపంచదేశాల మధ్య అగాధం
- జీ7 వేదికపై ప్రధాని మోదీ గళం

ఫ్రాన్స్‌లోని ఎవియాన్ నగరంలో ప్రతిష్టాత్మక జీ7 దేశాల సదస్సు ఎంతో ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సులో భాగంగా జరిగిన ఒక ప్రత్యేక భాగస్వామ్య సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. 'కొత్త భాగస్వామ్యాల ఏర్పాటు అంతర్జాతీయ సంఘీభావ పునరుద్ధరణ" అనే ముఖ్యమైన అంశంపై జరిగిన ఈ చర్చల్లో ఆయన తన అమూల్యమైన సందేశాన్ని అందించారు. ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య వనరుల కొరత ఏమాత్రం లేదని, కేవలం పరస్పర నమ్మకం కొరత మాత్రమే ప్రపంచాన్ని వేధిస్తోందని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల ద్వారా స్పష్టం చేశారు. నేటి కాలంలో పరస్పర నమ్మకమే అత్యంత కీలకమైన వ్యూహాత్మక ఆస్తి అని ఆయన ప్రపంచ దేశాలకు గుర్తుచేశారు.

### గ్లోబల్ సౌత్ దేశాల ఆకాంక్షల ప్రతిబింబం

అభివృద్ధి చెందుతున్న, పేద దేశాల కూటమి అయిన గ్లోబల్ సౌత్ ప్రయోజనాల కోసం భారతదేశం అంతర్జాతీయ వేదికలపై నిరంతరం పోరాడుతోంది. ఈ సదస్సులో కూడా ప్రధాని మోదీ ఇదే విషయాన్ని బలంగా ప్రస్తావించారు. ప్రపంచ దేశాల నుండి గ్లోబల్ సౌత్ దేశాలు కేవలం సహాయాన్ని మాత్రమే ఆశించడం లేదని, సమానత్వంతో కూడిన బలమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నాయని ఆయన స్పష్టం చేశారు. దాతలు/గ్రహీతలు అనే పాత పద్ధతులను పక్కన పెట్టి, అభివృద్ధి రంగంలో అందరూ సమానంగా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆఫ్రికా ఖండంలో భారత్ చేపట్టిన తాగునీరు, వ్యవసాయం, విద్యుత్, శిక్షణ వంటి సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను ప్రధాని ఈ సందర్భంగా ప్రపంచ దేశాల ప్రతినిధులకు వివరించారు.



### మోదీ ట్రంప్ ముఖాముఖి భేటీ

ఈ సదస్సులో అందరి దృష్టి భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వైపే నిలిచింది. ఫిబ్రవరి 2025 తర్వాత వీరిద్దరూ నేరుగా కలుసుకోవడం ఇదే మొదటిసారి. సమావేశ మందిరంలో వీరిద్దరూ పక్కపక్కనే కూర్చుని పరస్పరం కరచాలనం చేసుకున్నారు. అయితే అంతకుముందు జరిగిన నేతల ఉమ్మడి గ్రూపు ఫోటో కార్యక్రమంలో వీరిద్దరూ ఒకరినొకరు పలకరించుకోకపోవడం గమనార్హం.

### ద్వైపాక్షిక చర్చలు భవిష్యత్తు ప్రణాళికలు

భారత్, అమెరికా దేశాల మధ్య ఉన్న వాణిజ్య ఒప్పందాల జాప్యం, ఐటీ నిపుణుల వీసాల నియంత్రణ వంటి అంశాలు ఇరు దేశాల బంధానికి పెద్ద సవాలుగా మారాయి. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం మోదీ, ట్రంప్ మధ్య జరగబోయే అధికారిక ద్వైపాక్షిక చర్చలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ చర్చల ద్వారా ఇరు దేశాల మధ్య ఉన్న విభేదాలను తొలగించుకోవడానికి ఒక మంచి అవకాశం లభిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ జీ7 సదస్సు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడితోనే కాకుండా కెనడా, బ్రిటన్, యూఏఈ దేశాల అధినేతలతో కూడా విడివిడిగా సమావేశమై కీలకమైన ద్వైపాక్షిక అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరపనున్నారు.

# నరహరి ఇంటి నిండా నోట్ల కట్టలు

- ల్యాండ్ సర్వే అధికారి ఇళ్లంతా డబ్బే డబ్బు
- ఏసీబీ రెయిడ్స్‌లో అక్రమాస్తుల గుట్టురట్టు

తెలంగాణ ల్యాండ్ అండ్ సర్వే విభాగంలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి అక్రమాస్తుల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. మల్టీ జోన్2 డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావుపై అవినీతి నిరోధక శాఖ నిర్వహించిన సోదాల్లో కోట్ల రూపాయల నగదు, బంగారం, స్థిరాస్తుల పత్రాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌తో పాటు పది ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగిన దాడుల్లో అధికారులను సైతం ఆశ్చర్యపరిచే స్థాయిలో ఆస్తులు బయటపడ్డాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించిన ఏసీబీ, ఇప్పటివరకు రూ.13 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించింది. ఈ వ్యవహారం ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది.

### పది చోట్ల ఏకకాలంలో ఏసీబీ తనిఖీలు

ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయి. నరహరి నివాసం, కార్యాలయంతో పాటు నారాయణగూడలోని ఆయన బంధువులు, స్నేహితులు, ఆప్తుల ఇళ్లలో సోదాలు జరిగాయి. నరహరి గతంలో రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో భూమి సర్వే, సరిహద్దు వివాదాల పరిష్కారం, భూసేకరణ వంటి కీలక బాధ్యతలను దుర్వినియోగం చేసి అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు.



### ఇల్లు నిండా నగదు, బంగారు ఆభరణాలు

ఈ సోదాలలో అధికారులు షాక్ అయ్యేలా భారీగా అక్రమాస్తులు బయటపడ్డాయి. నరహరి, ఆయన తమ్ముడి ఇళ్ల నుంచి దాదాపు 1.54 కోట్ల రూపాయల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు బ్యాంకు ఖాతాలలో 2.29 కోట్ల రూపాయల నిల్వలు, 5.04 కోట్ల రూపాయల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నట్లు కనుగొన్నారు. తనిఖీల్లో సుమారు 1.3 కిలోల బంగారు ఆభరణాలు, 8 కిలోల వెండి వస్తువులను సీజ్ చేశారు.



### బినామీల పేరిట విలాసవంతమైన భవనాలు

నగదు, బంగారం మాత్రమే కాకుండా భారీగా స్థిరాస్తుల పత్రాలను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. గచ్చిబౌలి టీఎన్‌జీఓస్ కాలనీలో ఒక మూడు అంతస్తుల భవనం, చాత్రినాకలో రెండు అంతస్తుల ఇల్లు ఉన్నట్లు గుర్తించారు. రంగారెడ్డి జిల్లాలో ఐదు ఖాళీ ప్లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నాయి. పుప్పాలగూడ, నార్సింగి, రాజేంద్రనగర్ వంటి ఖరీదైన ప్రాంతాలలో పలు విలాసవంతమైన ఫ్లాట్లకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

### పదమూడు కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

నరహరి భార్య పేరిట ఉన్న రెండు బ్యాంకు లాకర్లను ఇంకా తెరవాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం దొరికిన ఆస్తుల ప్రభుత్వ అధికారిక విలువ సుమారు 13.05 కోట్ల రూపాయలుగా లెక్కగట్టారు. మార్కెట్ విలువ ప్రకారం ఇవి వందల కోట్లలో ఉంటాయని అంచనా వేస్తున్నారు. అక్రమాస్తుల కేసులో డిప్యూటీ డైరెక్టర్ నరహరి రావును ఏసీబీ అధికారులు అధికారికంగా అరెస్ట్ చేశారు. నిందితుడిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

# కాంట్రాక్టర్ల సమస్యలపై సర్కార్ యాక్షన్ ప్లాన్

### బకాయిలు చెల్లిస్తామన్న మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్రంలో కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని తన క్యాంపు కార్యాలయంలో బిల్డర్స్, కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘంగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంట్రాక్టర్ల సమస్యల పట్ల ఎంతో సానుకూలంగా ఉన్నారని, గత ప్రభుత్వం పెట్టిన ఆర్థిక ఇబ్బందుల నుంచి రక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన హామీ ఇచ్చారు.

### గత ప్రభుత్వ నిర్లక్ష్యమే ఆత్మహత్యలకు కారణం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పుడు నిర్ణయాల వల్లే కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు కేవలం తమకు నచ్చిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి, అత్యంత అవసరమైన ప్రాజెక్టులను పక్కన పెట్టారని విమర్శించారు. కేవలం రోడ్లు, భవనాల శాఖలోనే గత ప్రభుత్వం దాదాపు 4,000 కోట్ల రూపాయల పెండింగ్ బకాయిలు పెట్టిపోయిందని, యాదాద్రి పనులకు కూడా 350 కోట్ల రూపాయలు బాకీ పడ్డారని తెలిపారు.

### రికార్డు స్థాయిలో బిల్లుల విడుదల

ప్రస్తుతం రాష్ట్రం ఆర్థిక ఒత్తిడిలో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టర్ల ప్రయోజనాలకు పెద్దపీట వేసిందని మంత్రి వివరించారు. ఇప్పటివరకు కాంట్రాక్టర్లకు 3,000 కోట్ల రూపాయలకు పైగా పాత బిల్లులను విడుదల చేశామని చెప్పారు. ఇంకా 2,500 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని, చిన్న కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులకు సైతం ఇప్పటికే 140 కోట్ల రూపాయలు చెల్లించామని పేర్కొన్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి, మూడు నెలల వ్యవధిలో మిగిలిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

### రోడ్ల అభివృద్ధికి భారీ ప్రాజెక్టులు

తెలంగాణను దేశంలోనే ఉత్తమ రహదారులు ఉన్న రాష్ట్రంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. త్వరలోనే నల్గొండలో భారీ బహిరంగ సభ నిర్వహించి, 13,000 కోట్ల రూపాయల విలువైన హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు.

# రష్యా చమురుపై మళ్లీ ట్రంప్ ఆంక్షలు

### ఉక్రెయిన్ సంక్షోభంపై జీ7 అగ్రనేతల సమీక్ష

ఫ్రాన్స్‌లోని ఎవియాన్ నగరంలో జరుగుతున్న జీ7 పారిశ్రామిక దేశాల శిఖరాగ్ర సదస్సులో ఉక్రెయిన్ యుద్ధం మళ్లీ ప్రధాన అజెండాగా మారింది. రష్యా జరిపిన పూర్తి స్థాయి దురాక్రమణ దాడి నాలుగు సంవత్సరాలు దాటిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇతర ప్రపంచ దేశాల అధినేతలతో కలిసి ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. గత కొన్ని వారాలుగా ఇరాన్ ఘర్షణల వల్ల ఉక్రెయిన్ సమస్య కాస్త పక్కకు పోయినప్పటికీ, గల్ఫ్ ప్రాంతంలో మూడున్నర నెలల సంక్షోభాన్ని ముగించడానికి కుదిరిన ఒప్పందం తర్వాత ట్రంప్ తన దృష్టిని మళ్లీ ఉక్రెయిన్‌పై కేంద్రీకరించారు. ఇరాన్ వివాదం త్వరలోనే ముగిసిపోతుందని, ఇకపై రష్యా దూకుడుకు అడ్డుకట్ట వేయడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు.

### రష్యా చమురు రవాణాపై ఆంక్షల పునరుద్ధరణ

ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలను తగ్గించే ఉద్దేశంతో రష్యా చమురు రవాణాపై గత మార్చి నెలలో అమెరికా తాత్కాలికంగా సడలించిన ఆంక్షలను త్వరలోనే మళ్లీ పునరుద్ధరించనున్నట్లు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు రవాణా పుంజుకోవడంతో ఈ నిర్ణయం తీసుకోవడానికి మార్గం సుగమమైంది. చమురు సరఫరా సాధారణ స్థితికి వస్తున్నందున రష్యా ఆర్థిక వనరులను దెబ్బతీయడానికి ఆంక్షలు విధించే సరైన సమయం ఆసన్నమైందని ఆయన విలేకరులతో చెప్పారు. ఇదే సమయంలో బ్రిటన్ ప్రభుత్వం కూడా రష్యాకు వ్యతిరేకంగా సరికొత్త ఆంక్షలను ప్రకటించింది. రష్యా రహస్యంగా చమురు, గ్యాస్ రవాణా చేయడానికి ఉపయోగిస్తున్న షాడో నౌకాదళాన్ని, పాశ్చాత్య దేశాల ఆంక్షల నుండి తప్పించుకోవడానికి మాస్కో వాడుతున్న ఆర్థిక నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకుని బ్రిటన్ ఈ చర్యలు చేపట్టింది.



# రాహుల్ గాంధీ ఒక బిగ్ జోక్

- కాంగ్రెస్ అగ్రనేతపై డీఎంకే ఫైర్
- కూటమి రాజకీయాల్లో భూకంపం

తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ద్రావిడ మున్నేట్ర కజగం తీవ్రస్థాయిలో విమర్శల దాడికి దిగింది. రాహుల్ గాంధీని ఒక పెద్ద జోక్ అంటూ డీఎంకే ఐటీ వింగ్ సామాజిక మాధ్యమాల్లో ఘాటుగా ఎద్దేవా చేసింది. విపక్షాల ఇండియా కూటమిలో ఐక్యతను దెబ్బతీయడానికి రాహుల్ గాంధీ తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలే కారణమని డీఎంకే అధికారిక పత్రిక 'మురసోలి' తన సంపాదకీయంలో ఆరోపించింది. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న రాజకీయ విధానాలు పొత్తుల ధర్మానికి విరుద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది.

### ఎన్నికల ముగిశాక కాంగ్రెస్ ద్రోహం

తమిళనాడులో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో భాగంగా కాంగ్రెస్ పోటీ చేసి ఐదు స్థానాలను గెలుచుకుంది. అయితే ఎన్నికల ఫలితాలు రాగానే కాంగ్రెస్ పార్టీ డీఎంకేకు పెద్ద హ్యాండ్ ఇచ్చింది. నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే, ప్రభుత్వంలో భాగస్వామిగా చేరింది. కాంగ్రెస్ ఉనికి కోసం కొట్టుమిట్టాడుతున్న సమయంలో తాము భుజాలపై మోసి గెలిపిస్తే, కొత్త లాభం కనిపించగానే కూటమిని వీడి వెళ్లిపోయారని డీఎంకే మండిపడింది. ఈ స్వార్థపూరిత నిర్ణయం కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం పూర్తి ఆమోదంతోనే జరిగిందని డీఎంకే నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఇతర రాష్ట్రాల కూటమిలో అసంతృప్తి

కాంగ్రెస్ పార్టీ నైజం కేవలం తమిళనాడులోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ కూటమి భాగస్వాములకు నష్టం చేకూర్చేలా ఉందని మురసోలి పత్రిక గుర్తుచేసింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ అక్కడి ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేయడం, ఎడమపక్షాలకు బీజేపీతో రహస్య ఒప్పందం ఉందని ఆరోపించడంపై కమ్యూనిస్ట్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి దేశంలో ప్రధాన శత్రువైన బీజేపీని ఎదిరించడం కంటే తమ సొంత కూటమి భాగస్వాములను దెబ్బతీయడమే ఎక్కువ ఆసక్తిగా ఉందా అని లెఫ్ట్ పార్టీల నేతలు ప్రశ్నించిన విషయాన్ని డీఎంకే తన వ్యాసంలో ప్రత్యేకంగా ప్రస్తావించింది.



### జాతీయ స్థాయి సమావేశాల బహిష్కరణ

ఈ ఘర్షణ వాతావరణం కారణంగా జాతీయ స్థాయిలో డీఎంకే, కాంగ్రెస్ మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటీవల కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ఇండియా కూటమి సమావేశాన్ని డీఎంకే బహిష్కరించి తన నిరసనను తెలిపింది. కాంగ్రెస్ పిలిచిన సమావేశాలకు తాము హాజరుకాబోమని, అయితే ఇతర విపక్షాలు లేవనెత్తే ప్రజా సమస్యలకు తమ మద్దతు ఎప్పుడూ కొనసాగుతుందని డీఎంకే ప్రకటించింది.

# డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

- గోవా టు హైదరాబాద్ డ్రగ్స్ గుట్టురట్టు
- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో ఈగల్ ఫోర్స్ దాడులు

తెలంగాణలోని వివిధ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే పక్కా సమాచారంతో ఈగల్ ఫోర్స్ రంగంలోకి దిగింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏకకాలంలో భారీ దాడులు నిర్వహించింది. ఈ మెరుపు తనిఖీల్లో భాగంగా మొత్తం 19 మందిని ఈగల్ ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఈ ఆపరేషన్ సాగింది. ఇందుకోసం ప్రత్యేకంగా 15 బృందాలను రంగంలోకి దించారు.

### వైద్య పరీక్షల్లో తేలిన నగ్నసత్యాలు

పట్టుబడిన నిందితులకు అధికారులు తక్షణమే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఊహించని నిజాలు బయటపడ్డాయి. అదుపులోకి తీసుకున్న వారిలో 14 మందికి గంజాయి సేవించినట్లు పాజిటివ్‌గా తేలింది. మరో వ్యక్తికి గంజాయితో పాటు ప్రమాదకరమైన డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. పట్టుబడిన వారందరూ తాము క్రమం తప్పకుండా డ్రగ్స్ వాడుతున్నట్లు విచారణలో అంగీకరించారు. దీంతో అధికారులు వారందరినీ తదుపరి చికిత్స నిమిత్తం డీ అడిక్షన్ సెంటర్లకు తరలించారు. ఈ విషయమై వారి తల్లిదండ్రులకు కూడా సమాచారం అందించారు.

### గోవా కేంద్రంగా సాగుతున్న సరఫరా

నిందితులను విచారించిన ఈగల్ ఫోర్స్ బృందాలు పలు కీలక విషయాలను రాబట్టాయి. గోవాలోని ప్రముఖ వగటోర్ బీచ్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని ఒక పెద్ద ముఠా కొకైన్, ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ, హ్యాష్ ఆయిల్ వంటి నిషేధిత మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ డ్రగ్స్‌ను గోవా, బెంగళూరు నగరాల నుంచి హైదరాబాద్‌కు రహస్యంగా రవాణా చేస్తున్నట్లు కనుగొన్నారు. ఈ ముఠా నగరంలోని సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులకు కూడా డ్రగ్స్ విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.



### సాంకేతిక విశ్లేషణతో కస్టమర్ల గుర్తింపు

పోలీసులు జరిపిన సాంకేతిక విశ్లేషణ దర్యాప్తులో డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న మొత్తం 44 మంది వినియోగదారుల వివరాలు బయటపడ్డాయి. ఈ డ్రగ్స్ కస్టమర్లు కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మత్తుపదార్థాల కొనుగోలు కోసం వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డి అనే ఇద్దరు వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు రూ.3.13 లక్షలకు పైగా నగదు బదిలీ చేసినట్లు ఆధారాలు లభించాయి. నిందితులిద్దరూ గతంలో 2019 లోనే ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయిన పాత నేరస్థులని ఈగల్ ఫోర్స్ వెల్లడించింది.

# అన్నలు లేరని అలుసు తీసుకుంటే ఖబర్దార్

- ఇప్పుడు వారంతా మా పార్టీలోనే ఉన్నారు
- సింగరేణి యాజమాన్యానికి కవిత స్ట్రాంగ్ వార్నింగ్

"అడవిలో అన్నలు లేరని అలుసు తీసుకుంటే ఖబర్దార్.. వారంతా ఇప్పుడు మా పార్టీలోనే ఉన్నారు" అంటూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత సింగరేణి యాజమాన్యంపై నేరుగా విరుచుకుపడ్డారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఆర్కే 7 భూగర్భ గని వద్ద జరిగిన ఉద్రిక్త పరిణామాల మధ్య కార్మికుల హక్కుల కోసం పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత చేపట్టిన "బొగ్గుబాయి" కార్యక్రమం సందర్భంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని ఆర్కే7 భూగర్భ గని వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గని ఆవరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కవితను, పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. అనంతరం గేట్లను దాటి గని ప్రాంగణంలోకి ప్రవేశించిన కవిత, సింగరేణి యాజమాన్యంపై తీవ్ర విమర్శలు చేశారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం మానవ హక్కుల ఉల్లంఘన అని ఆరోపించారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరించిన ఆమె, గతంలో అడవిలో ఉన్న అన్నలంతా ఇప్పుడు తమ పార్టీలోనే ఉన్నారని వ్యాఖ్యానిస్తూ యాజమాన్యానికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కూడా ప్రశ్నలు సంధించారు. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత చేపట్టిన "బొగ్గుబాయి" కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 భూగర్భ గని వద్ద భారీ ఉద్రిక్తత చోటుచేసుకుంది.



### సింగరేణిలో మానవ హక్కుల ఉల్లంఘన

కార్మికులతో కలిసి గేట్ మీటింగ్ పెట్టుకునే కనీస హక్కును కూడా సింగరేణి యాజమాన్యం కాలరాస్తోందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. భూగర్భంలో ప్రాణాలకు తెగించి పనిచేసే కార్మికులకు యాజమాన్యం కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించడం లేదని మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనేనని ఆరోపించారు. కార్మికులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, సింగరేణిలో జరిగే అక్రమాలను నిరంతరం నిలదీస్తూనే ఉంటామని, అవసరమైతే న్యాయపరంగా పోరాడతామని హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత తీవ్రస్థాయిలో ప్రశ్నల వర్షం కురిపించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క సింగరేణి ప్రాంతాల్లో పర్యటించలేదా అని నిలదీశారు. ఇప్పుడు తాము వచ్చి కార్మికుల సమస్యలు తెలుసుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ఎన్ని రోజులు అధికారంలో ఉంటారో చూస్తామన్నారు. కార్మికుల హక్కుల కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

# టెలిగ్రామ్ నిషేధంపై సీఈఓ ఆగ్రహం

- బ్యాన్‌తో సమస్య అస్సలు పరిష్కారం కాదు



భారత ప్రభుత్వం తీసుకున్న ఈ తాత్కాలిక నిషేధ నిర్ణయాన్ని టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్ తీవ్రంగా తప్పుపట్టారు. కొందరు నిందితులు చేసిన తప్పుకు భారతదేశంలోని 15 కోట్ల మంది సాధారణ టెలిగ్రామ్ వినియోగదారులను శిక్షించడం ఎంతవరకు న్యాయమని ఆయన ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఈ నిషేధం వల్ల సమస్యేమీ పరిష్కారం కాలేదని, లీకేజీల ప్రచారం కేవలం ఇతర యాప్‌లలోకి మారిందని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని వారాలుగా లీక్డ్ మెటీరియల్స్ షేర్ చేస్తున్న వందలాది ఛానళ్లను తాము ఇప్పటికే తొలగించామని ఆయన వివరించారు. టెలిగ్రామ్ సమాజానికి మంచి చేసే శక్తి అని, దీనిపై నిషేధం విధించడం ముమ్మాటికీ పెద్ద పొరపాటేనని దురోవ్ స్పష్టం చేశారు.

### ఇంటర్నెట్ నిపుణుల భిన్నాభిప్రాయాలు

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ స్పందిస్తూ, ఇది ఒక తాత్కాలిక ఉపశమన చర్య మాత్రమేనని, రాజ్యాంగపరమైన ఆందోళనలకు దారితీస్తుందని విమర్శించింది. కేవలం ఒక సమాచార మాధ్యమంలో తప్పుడు సమాచారం ఉందనే నెపంతో మొత్తం ప్లాట్‌ఫామ్‌ను మూసివేయడం సరికాదని కొందరు సైబర్ నిపుణులు అభిప్రాయపడ్డారు. టెలిగ్రామ్ యాప్‌ను ప్రాక్సీ విధానాల ద్వారా సులభంగా వాడొచ్చని, పూర్తిగా బ్లాక్ చేయడం సాధ్యం కాదని ఐఐటీ కాన్పూర్ సైబర్ సెక్యూరిటీ విభాగానికి చెందిన నిపుణులు తెలిపారు. అయితే ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ మణీంద్ర అగర్వాల్ మాత్రం ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించారు. టెలిగ్రామ్‌లో ఎడిట్ చేసినట్లు తెలియకుండా పోస్ట్‌లను మార్చే ప్రమాదకరమైన ఫీచర్ ఉందని, ఇది విద్యార్థుల్లో లేనిపోని గందరగోళాన్ని సృష్టిస్తోందని ఆయన సమర్థించారు.

### నీట్ విద్యార్థుల ఆందోళన నివారణకు చర్యలు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ 2026 రీఎగ్జామినేషన్ సజావుగా నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. జూన్ 21వ తేదీన జరగబోయే ఈ ప్రవేశ పరీక్ష ముగిసేవరకు ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పరీక్షా పత్రాల లీకేజీలకు సంబంధించిన నకిలీ వార్తలు, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా అడ్డుకోవడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ తెలిపారు. టెలిగ్రామ్‌లో ఉన్న ఒక ప్రత్యేకమైన ఎడిట్ ఫీచర్‌ను కొందరు కేటుగాళ్లు తమ స్వార్థానికి వాడుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు.

# సీబీఎన్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్

- చంద్రబాబు విజన్‌పై అంతర్జాతీయ పుస్తకం

"సీబీఎన్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్" అనే పుస్తకాన్ని సింగపూర్ పర్యటనలో భాగంగా చంద్రబాబు ఆవిష్కరించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం చాలా ఘనంగా జరిగింది. ఈ పుస్తకం తొలి ప్రతులను సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, అసోసియేషన్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి స్వయంగా అందజేశారు.

### చంద్రబాబు దార్శనికతకు నిలువుటద్దం

ఈ విశిష్ట పుస్తకాన్ని 'రేపటి కోసం' దినపత్రిక చీఫ్ ఎడిటర్ శాఖమూరి శ్రీనివాస ప్రసాద్ రచించారు. దీనిని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలోకి అద్భుతంగా అనువదించారు. ఒక గొప్ప దార్శనిక నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ సందర్భాల్లో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలను విశ్లేషిస్తూ ఈ పుస్తకాన్ని రూపొందించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పాలకులుగా గుర్తింపు పొందిన సింగపూర్ మాజీ ప్రధాని లీ క్వాన్ యూ, న్యూజిల్యాండ్ మాజీ ప్రధాని జేసిందా ఆర్డ్నాడ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ నేతల తరహాలోనే చంద్రబాబు నిర్ణయాలు ఉంటాయని రచయిత కొనియాడారు.

### అంతర్జాతీయ గుర్తింపు అవార్డుల ప్రదానం

ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి విజన్‌ల రూపకల్పన చేయడం, అమరావతి రాజధాని నిర్మాణంలో చంద్రబాబు చూపిస్తున్న శ్రద్ధ ఆయన నాయకత్వానికి ప్రత్యక్ష ఉదాహరణలని పుస్తకంలో వివరించారు. ఏపీ రెరా మాజీ చైర్మన్ రామనాథ్ వివిధ సందర్భాల్లో వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో బాహ్య ప్రపంచానికి తెలియని అనేక రహస్య అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. సింగపూర్ ప్రభుత్వ గుర్తింపు పొందిన కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ముఖ్యమంత్రిని "గ్లోబల్ పాలీమ్యాథ్" అవార్డుతో సత్కరించింది.

### వివిధ భాషల్లో విడుదలకు సన్నాహాలు

సింగపూర్ రూపకర్త లీ క్వాన్ యూ శతజయంతిని పురస్కరించుకుని విడుదల చేసిన ఒక ప్రత్యేక వెండి నాణేన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అసోసియేషన్ ప్రతినిధులు బహూకరించారు. త్వరలోనే ఈ విలువైన పుస్తకాన్ని తెలుగు, హిందీ సహా వివిధ భారతీయ భాషల్లో విడుదల చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో రెరా మాజీ చైర్మన్ రామనాథ్, కేవీ సత్యనారాయణ, శంకర ప్రసాద్, సింగపూర్‌లోని పలువురు తెలుగు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సెంటర్ ఆఫ్ అట్రాక్షన్

## స్టేట్, సెంట్రల్ పాలిటిక్స్‌లో సెన్సేషన్

### మోడీకి నమ్మిన బంటు... బాబు తోడుంటూ పవన్ కళ్యాణ్ రాజకీయ వ్యూహం

**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగిన జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకవైపు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి శ్రమిస్తూనే, మరోవైపు దేశ రాజధాని ఢిల్లీ వేదికగా తన రాజకీయ ముద్రను వేస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా దేశ సమగ్రత, సనాతన ధర్మ రక్షణపై ఆయన స్పష్టమైన జాతీయ సంకేతాలు ఇచ్చారు. దక్షిణాదిలో విస్తరించాలని చూస్తున్న బీజేపీ అగ్రనేతలు నరేంద్ర మోదీ, అమిత్ షాలకు పవన్ కళ్యాణ్ అత్యంత నమ్మకమైన, ప్రజాదరణ కలిగిన మిత్రుడిగా మారారు. కేంద్రంతో ఉన్న ఈ బలమైన సత్సంబంధాల ద్వారా పోలవరం నిధులు, అమరావతి నిర్మాణం వంటి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను సాధించడమే పవన్ ప్రధాన వ్యూహం. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనపై, నారా లోకేశ్ భవిష్యత్ నాయకత్వంపై దృష్టి పెట్టగా, పవన్ కళ్యాణ్ ఇటు స్టేట్, అటు సెంట్రల్ రాజకీయాలను సమన్వయం చేస్తూ కూటమికి రక్షణ కవచంగా నిలుస్తున్నారు. పవన్ కళ్యాణ్ కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం కాకుండా కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో జనసేనను బలోపేతం చేస్తూ ప్రాంతీయ పార్టీని జాతీయ శక్తిగా మారుస్తున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని, హక్కులను ఢిల్లీ వేదికపై ధైర్యంగా వినిపించే బలమైన గొంతుకగా ఆయన అవతరించారు. ఒకే లక్ష్యంతో రెండు వైపులా ఆయన వేస్తున్న అడుగులు తెలుగు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నాయి.**

**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్థానం ఒక అద్భుత అధ్యాయం. ప్రస్తుతం ఆయన రాష్ట్ర రాజకీయాల పరిమితులను దాటి జాతీయ వేదికపై తన రాజకీయ ముద్రను వేసేందుకు సిద్ధమవుతున్నారు. పవన్ కళ్యాణ్ ఒకే లక్ష్యంతో రెండు బలమైన వ్యూహాలను అమలు చేస్తున్నారు. ఒకవైపు ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి శ్రమిస్తూనే, మరోవైపు ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేందుకు అడుగులు వేస్తున్నారు. ఈ డబుల్ ధమాకా వ్యూహం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సరికొత్త సంచలనాలకు దారితీస్తోంది. కేవలం ఒక ప్రాంతీయ పార్టీ నాయకుడిగా మిగిలిపోకుండా దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకునేలా ఆయన ప్రణాళికలు ఉన్నాయి.**

**• ఢిల్లీ వేదికగా జనసేన జాతీయ సంకేతాలు**

ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జనసేన రాజకీయ కార్యక్రమం జాతీయ స్థాయిలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ సమావేశానికి కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులను, ప్రముఖ నాయకులను ఆహ్వానించడం విశేషం. ఈ వేదికపై పవన్ కళ్యాణ్ దేశ సమగ్రత, సనాతన ధర్మ రక్షణ, భారతీయ సాంప్రదాయ విలువలు, దేశ ఐక్యత వంటి జాతీయ అంశాలపై స్పష్టమైన ప్రకటనలు చేశారు. ఈ పరిణామాలు జనసేన కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం కాదనే సంకేతాన్ని స్పష్టంగా ఇచ్చాయి. ఢిల్లీ వేదికను ఉపయోగించుకుని తన సిద్ధాంతాలను దేశవ్యాప్తంగా ప్రచారం చేసేలా పవన్ కళ్యాణ్ అడుగులు వేస్తున్నారు. సినీ గ్లామర్ ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చింది పదవుల కోసం కాదు. ఆయన వ్యక్తిగత ప్రయోజనాల కంటే ఆశయాలకు, సిద్ధాంతాలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. 2014లో పార్టీ స్థాపించినప్పటి నుండి ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ ఎక్కడా తన నైతిక విలువలను వదులుకోలేదు. 2024 అసెంబ్లీ ఎన్నికలలో జనసేన సాధించిన వంద శాతం విజయంతో ఆయన నాయకత్వ పటిమ ఏంటో దేశానికి తెలిసింది. ప్రజల్లో ఆయనపై ఉన్న నమ్మకం, క్రేజ్ ఇప్పుడు జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగేందుకు సరైన వాతావరణాన్ని కల్పించాయి. యువతలో ఉన్న విపరీతమైన ఆదరణ ఆయనకు అతిపెద్ద బలంగా మారింది.

**• దక్షిణాదిలో కమలనాథులకు పవనాస్త్రం**

దేశ వ్యాప్తంగా పార్టీని అందనంత ఎత్తుకు ఎదిగేలా చేసినా, బీజేపీకి దక్షిణాది మాత్రం అందని ద్రాక్షగా మిగులుతోంది. ఒక్క కర్ణాటకలో తప్పించి మిగతా చోట్ల పార్టీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

ఈ తరుణంలో బీజేపీ, దక్షిణ భారతదేశంలో తన ప్రభావాన్ని మరింత విస్తరించుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తోంది. ఇటువంటి తరుణంలో దక్షిణాది రాష్ట్రాల్లో విపరీతమైన ప్రజాదరణ, సామాజిక అవగాహన, యువతలో పట్టు ఉన్న పవన్ కళ్యాణ్ వంటి నాయకుడు జాతీయ కూటమికి ఎంతో కీలకంగా మారారు. తమిళనాడు, కర్ణాటక, కేరళలో సైతం పవన్ కళ్యాణ్‌కు భారీగా అభిమానులు ఉన్నారు. ఈ ప్రజాదరణను జాతీయ రాజకీయాల్లో సానుకూలంగా మార్చుకోవాలని కూటమి భావిస్తోంది. జాతీయ అంశాలపై పవన్ కళ్యాణ్ వ్యక్తపరుస్తున్న నిఖార్సైన అభిప్రాయాలు ఆయనను ఢిల్లీ పెద్దలకు మరింత దగ్గర చేశాయి. అదే సమయంలో, పవన్ కళ్యాణ్ జాతీయ రాజకీయాల్లో చురుగ్గా మారడం వెనుక ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు దాగి ఉన్నాయన్నది జగమెరిగిన సత్యం. కేంద్ర ప్రభుత్వంతో బలమైన, ప్రత్యక్ష సంబంధాలు కలిగిన నాయకుడు రాష్ట్రానికి ఉంటే ఎన్నో లాభాలు చేకూరుతాయి. విభజన సమస్యలు, పోలవరం ప్రాజెక్టు నిధులు, అమరావతి రాజధాని నిర్మాణం, విశాఖ ఉక్కు పరిశ్రమ రక్షణ వంటి కీలకమైన అంశాలను ఢిల్లీలో గట్టిగా వినిపించే స్వరంగా పవన్ మారుతున్నారు. కేంద్రం నుండి పెద్ద ఎత్తున పారిశ్రామిక పెట్టుబడులను, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సాధించడంలో ఆయన జాతీయ ఇమేజ్ రాష్ట్రానికి శ్రీరామరక్షగా మారబోతోందని జనసేన శ్రేణులు నమ్ముతున్నాయి.

**• చంద్రబాబు నాయుడి రాజకీయ దూరదృష్టి**

సాధారణంగా రాజకీయాల్లో ఒకే తరం కలిగిన ఇద్దరు సమకాలీన ప్రసిద్ధ నాయకుల మధ్య తీవ్రమైన పోటీ ఉంటుంది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ మధ్య పరస్పర సహకారం, సమన్వయం కనిపిస్తోంది. వీరిద్దరి మధ్య ఎటువంటి ఈర్ష్యాద్వేషాలు లేకుండా రాష్ట్ర ప్రగతి కోసం కలిసి నడుస్తున్నారు. పవన్ కళ్యాణ్ జాతీయస్థాయిలో తన ప్రభావాన్ని పెంచుకుంటూ తెలుగు ప్రజల గొంతుకగా నిలుస్తుంటే, నారా లోకేశ్ క్షేత్రస్థాయిలో యువతను సమాయత్తం చేస్తూ భవిష్యత్ పరిపాలనకు పునాదులు వేస్తున్నారు. ఈ ఇద్దరు యంగ్ లీడర్స్ కలయిక కూటమికి కొండంత బలాన్ని ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఐదు దశాబ్దాల అనుభవం ఉన్న నారా చంద్రబాబు నాయుడి వ్యూహాలు ఎప్పుడూ భిన్నంగా ఉంటాయి. ప్రస్తుత పరిణామాలను గమనిస్తే చంద్రబాబు ఒక అద్భుతమైన రాజకీయ నిర్మాణాన్ని రూపొందించినట్లు స్పష్టమవుతోంది. రాష్ట్ర పరిపాలన, అనుభవజ్ఞుడైన నాయకత్వ బాధ్యతలను చంద్రబాబు చూసుకుంటుంటే, భవిష్యత్ సంస్థాగత బలోపేతాన్ని లోకేశ్ చూస్తున్నారు. ఇదే సమయంలో జాతీయస్థాయి వ్యూహాలు, కేంద్రంతో సమన్వయ బాధ్యతలు.. రాష్ట్రంలో కూటమి ఇమేజ్, డామేజ్ కాకుండా పవన్ కళ్యాణ్ అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ త్రిముఖ వ్యూహం కూటమిని సుదీర్ఘకాలం పాటు అధికారంలో ఉంచేందుకు దోహదపడుతుందని మేధావులు చెబుతున్నారు.

**• ప్రాంతీయ పార్టీ నుండి జాతీయ శక్తిగా విస్తరణ**

2024 ఎన్నికల విజయంతో లభించిన ఉత్సాహంతో జనసేన పార్టీని ఇతర రాష్ట్రాల్లో కూడా విస్తరించేందుకు పవన్ కళ్యాణ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో జనసేన కమిటీలను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. కేవలం ఒకే ఒక్క రాష్ట్రానికి పరిమితమైన ప్రాంతీయ పార్టీ హోదా నుండి జాతీయ రాజకీయాలను శాసించగల శక్తిగా జనసేనను మార్చాలనేది పవన్ ఆకాంక్ష. తమ అధినేత ఢిల్లీ రాజకీయాల్లో చక్రం తిప్పడాన్ని చూసి క్షేత్రస్థాయిలోని జనసైనికులు, అభిమానులు ఎంతో గర్వంగా పండగ చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న పాలన ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ ప్రకారం జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణపై దృష్టి పెట్టారు. నారా లోకేశ్ ఐటీ రంగం, నిరుద్యోగ నిర్మూలన, పార్టీ క్యాడర్ బలోపేతంలో బిజీగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణతో పాటు జాతీయస్థాయిలో తెలుగు రాష్ట్రాల హక్కుల కోసం పోరాడుతున్నారు. ఈ మూడు శక్తులు పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగడం వల్ల రాష్ట్రంలో తిరుగులేని రాజకీయ స్థిరత్వం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.





**• తెలుగు ప్రజల గొంతుకగా పవన్ కళ్యాణ్**

రాజకీయాల్లో ఏ వ్యూహమైనా సక్సెస్ కావడానికి కొంత సమయం పడుతుంది. రాష్ట్రంలో ఆయన సీఎం కావాలని జనసైనికులతోపాటు, పలు వర్గాలు బలంగా కోరుకుంటున్నాయి. అదే సమయంలో పవన్ కళ్యాణ్, తన స్థాయిని మరింత ముందుకు తీసుకెళ్లి... మరింత ఎదుగాలన్న ఆలోచనతో అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. కానీ ప్రస్తుతం ఆయన వేస్తున్న అడుగులు మాత్రం అత్యంత వ్యూహాత్మకంగా ఉన్నాయి. స్థానికంగా ఒకే ఒక్కడు వ్యూహంతోపాటుగా, ఢిల్లీ పెద్దల వద్ద పవన్ కళ్యాణ్... తనకు లభిస్తున్న గౌరవాన్ని వచ్చే రోజుల్లో మరింత పీక్‌కు తీసుకెళ్లాలని భావిస్తున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని, హక్కులను ఢిల్లీ సుల్తానుల వద్ద తాకట్టు పెట్టకుండా, ధైర్యంగా గొంతు వినిపించే ఒక బలమైన జాతీయ నాయకుడిగా పవన్ కళ్యాణ్ అవతరించనున్నారని మాత్రం జనసైనికులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఒకే లక్ష్యంతో రెండు వైపులా చేస్తున్న ఈ పోరాటం తెలుగు రాజకీయాల్లో ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖిస్తోంది. రాబోయే రోజుల్లో ఇటు స్టేట్ అంటు సెంట్రల్ రాజకీయాలను మలుపు తిప్పే శక్తుల్లో పవన్ కళ్యాణ్ పేరు ప్రముఖంగా వినిపించనుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

**• తెలుగు జెండా.. ఢిల్లీ అజెండా**

పవన్ కళ్యాణ్ కేవలం అధికార పదవుల కోసం కాకుండా సిద్ధాంతాల కోసం రాజకీయం చేస్తూ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 2024 ఎన్నికల అద్భుత విజయంతో దేశవ్యాప్తంగా తన నాయకత్వ పటిమను నిరూపించుకున్న పవన్.. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో జనసేన పార్టీని విస్తరించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులలో కమిటీలను బలోపేతం చేస్తూ ప్రాంతీయ పార్టీని జాతీయ రాజకీయాలను శాసించగల శక్తిగా మార్చేందుకు అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న చంద్రబాబు నాయుడి సంక్షేమ పాలనకు, నారా లోకేశ్ యువ నాయకత్వానికి పవన్ కళ్యాణ్ తన జాతీయ ఇమేజ్‌తో కొండంత అండగా నిలుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఉన్న ప్రత్యక్ష సంబంధాల ద్వారా రాష్ట్ర హక్కులను, నిధులను సాధిస్తూనే కూటమి ప్రతిష్ఠ దెబ్బతినకుండా జాగ్రత్త పడుతున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల వద్ద తాకట్టు పెట్టకుండా, ధైర్యంగా గొంతు వినిపించే ఒక బలమైన నాయకుడిగా ఆయన అవతరించారు. ఇటు స్టేట్, అటు సెంట్రల్ రాజకీయాలను మలుపు తిప్పే శక్తుల్లో పవన్ కళ్యాణ్ పేరు చరిత్రలో నిలిచిపోనుంది.



## 12 ఏళ్ల నిరీక్షణకు ముగింపు

స్టార్ హీరోయిన్ త్రిష నటించిన ఓ సినిమా దాదాపు 12 ఏళ్ల తర్వాత ప్రేక్షకుల ముందుకు రానుండటం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎన్నో కారణాలతో విడుదలకు నోచుకోని ఈ చిత్రం ఇప్పుడు మళ్లీ వార్తల్లో నిలిచింది. అరవింద్ స్వామి, త్రిష ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'శతురంగ వట్టై–2' చిత్రీకరణ 2014లోనే పూర్తయింది. ఆర్వీ నిర్మల్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు హెచ్. వినోద్ కథను అందించారు. అయితే ఆ సమయంలో తలెత్తిన ఆర్థిక ఇబ్బందుల కారణంగా సినిమా విడుదల ఆగిపోయింది. ఇప్పటికే త్రిష దక్షిణాది సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా కొనసాగుతుండటంతో, ఆమెకు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం అన్ని పెండింగ్ సమస్యలను పరిష్కరించి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఇప్పటికీ ఆసక్తి కొనసాగుతోంది. ముఖ్యంగా త్రిష, అరవింద్ స్వామి కాంబినేషన్ మరోసారి వెండితెరపై కనిపించనుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే ఈ చిత్ర విడుదల తేదీపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు 12 ఏళ్లుగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్ట్ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు రానుండటం విశేషంగా మారింది.

## చివరి దశలో 'ఫౌజీ'!



రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. వాటిలో దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రభాస్ 'స్పిరిట్' పనులతో పాటు 'ఫౌజీ' చిత్రాన్ని కూడా త్వరగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఆయన వరుసగా డేట్స్ కేటాయించడంతో షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేసే దిశగా చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే డిజిటల్ హక్కుల విషయంలో ప్రముఖ ఓటీటీ సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని టాక్. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత విడుదల తేదీపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ సెట్లలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తోంది. సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ స్వరాలు సమకూరుస్తున్నారు. పీరియాడిక్ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సమాచారం. ఇక 'ఫౌజీ' చిత్రీకరణ పూర్తయిన తర్వాత ప్రభాస్ తన తదుపరి ప్రాజెక్ట్ 'కల్కి 2898 AD' సీక్వెల్ షూటింగ్‌లో పాల్గొనే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## 'విశ్వంభర'పై ఉత్కంఠ..

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక సోషియో–ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' విడుదలపై అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. పలుమార్లు విడుదల తేదీ వాయిదా పడటంతో మెగా అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేస్తారనే ప్రచారం జరిగినప్పటికీ, అది కార్యరూపం దాల్చలేదు. అనంతరం ఆగస్టు విడుదలపై వార్తలు వచ్చినా చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో సినిమా రిలీజ్‌పై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని దసరా సీజన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది చివరి త్రైమాసికంలో పలు భారీ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతుండగా, వచ్చే ఏడాది సంక్రాంతి మరియు సమ్మర్ సీజన్‌లకు కూడా ఇప్పటికే అనేక క్రేజీ ప్రాజెక్టులు క్యాలెండర్‌లో చోటు దక్కించుకున్నాయి. అలాగే చిరంజీవి – బాబీ కాంబినేషన్‌లో రూపొందుతున్న మరో చిత్రం కూడా వచ్చే ఏడాది విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'కు ఈ ఏడాది దసరా లేదా ఏడాది చివర్లోని అనుకూలమైన తేదీనే సరైన ఎంపికగా కనిపిస్తున్నట్లు సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. త్రిష కథానాయికగా నటిస్తుండగా, ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయిన నేపథ్యంలో, విడుదల తేదీపై త్వరలోనే చిత్రబృందం స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## మెగాస్టార్ బర్త్‌డే స్పెషల్..!



మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు మరో సర్‌ప్రైజ్ రెడీ అవుతోంది. ఆయన కెరీర్‌లో అత్యంత విజయవంతమైన ఎంటర్‌టైనర్‌లలో ఒకటైన 'శంకర్ దాదా ఎంబీబీఎస్' చిత్రాన్ని ప్రత్యేకంగా రీ–రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మెగాస్టార్ పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 22న ఈ చిత్రాన్ని థియేటర్లలో మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. కేదార్ ఫిల్మ్స్ ఆధ్వర్యంలో ఈ చిత్రాన్ని అత్యాధునిక 4కే డిజిటల్ ఫార్మాట్‌లో అప్‌గ్రేడ్ చేసి విడుదల చేయనున్నట్లు సమాచారం. దీంతో అభిమానులు ఈ క్లాసిక్ ఎంటర్‌టైనర్‌ను మరింత మెరుగైన విజువల్ క్వాలిటీతో ఆస్వాదించే అవకాశం పొందనున్నారు. దర్శకుడు జయంత్ సి. పరాన్జీ తెరకెక్కించిన 'శంకర్ దాదా ఎంబీబీఎస్' అప్పట్లో బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. చిరంజీవి తన కామెడీ టైమింగ్, ప్రత్యేక మేనరిజమ్స్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. అలాగే శ్రీకాంత్ పోషించిన ఏటీఎం పాత్ర కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోనాలి బింద్రే హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ అందించిన సంగీతం మరో ప్రధాన బలంగా నిలిచింది. పాటలు, కామెడీ సన్నివేశాలు, భావోద్వేగ క్షణాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇప్పుడు ఈ చిత్రం 4కే వెర్షన్‌లో మళ్లీ థియేటర్లలోకి రానుండటంతో మెగా అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. 'శంకర్ దాదా' సరదా కామెడీ, చిరంజీవి ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ ను మరోసారి వెండితెరపై ఆస్వాదించేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## సెకండ్ ఇన్నింగ్స్‌లో కాజల్ దూకుడు

టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ సెకండ్ ఇన్నింగ్స్‌లో మరింత జోరు చూపిస్తోంది. సంప్రదాయ గ్లామర్ పాత్రలకు భిన్నంగా, నటనకు ప్రాధాన్యం ఉన్న వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను కొత్త దిశగా తీసుకెళ్తోంది. ఈ క్రమంలోనే ఆమె ప్రముఖ దర్శకుడు సుధీర్ వర్మ తెరకెక్కిస్తున్న 'విశాఖ' వెబ్ సిరీస్‌తో ఓటీటీ రంగంలో అడుగుపెట్టనుంది. ఈ సిరీస్‌లో కాజల్ రెండు విభిన్న కోణాలు కలిగిన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఒకవైపు సాధారణ గృహిణిగా, మరోవైపు పరిస్థితుల కారణంగా శక్తివంతమైన మహిళగా మారే పాత్రలో ఆమె నటన ఆకట్టుకోనుందని టాక్ వినిపిస్తోంది. యాక్షన్, ఎమోషన్, థ్రిల్లింగ్ అంశాల మేళవింపుగా ఈ సిరీస్ రూపొందుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న 'విశాఖ' త్వరలో ఓటీటీ వేదికపై ప్రేక్షకుల ముందుకు రానుంది. జూలై లేదా ఆగస్టులో స్ట్రీమింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక వెబ్ సిరీస్‌లతో పాటు కాజల్ సినిమాల్లోనూ బిజీగా కొనసాగుతోంది. బాలకృష్ణ – గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తోంది. ఇలా సినిమాలు, ఓటీటీ ప్రాజెక్టులతో కాజల్ అగర్వాల్ మరోసారి ఫుల్ బిజీ షెడ్యూల్‌తో ముందుకు సాగుతోంది.



## కల్కి 2898 AD ఆలియా భట్?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. పురాణ గాథలకు సైన్స్ ఫిక్షన్ అంశాలను జోడిస్తూ రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. భారీ తారాగణం, అద్భుతమైన విజువల్స్ ఈ సినిమాను మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్ రూపొందించే పనిలో చిత్రబృందం నిమగ్నమై ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు ఆసక్తికర వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ఈ ప్రాజెక్ట్‌లో భాగం కాదనే వార్తలు వెలువడిన నేపథ్యంలో, ఆమె స్థానంలో ఎవరు కనిపిస్తారనే అంశంపై చర్చ సాగుతోంది. ఈ క్రమంలో బాలీవుడ్ నటి ఆలియా భట్ 'కల్కి' సీక్వెల్‌లో కీలక పాత్ర పోషించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో ఆలియా భట్ నిజంగానే ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా? ఆమె పాత్ర స్వరూపం ఎలా ఉండబోతోంది? అనే ప్రశ్నలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అయితే ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందో తెలుసుకోవాలంటే మేకర్స్ నుంచి అధికారిక స్పష్టత వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

## కొడుకును హీరోగా పరిచయం చేయనున్న ధనుష్?



తమిళ స్టార్ హీరో ధనుష్ నటుడిగానే కాకుండా దర్శకుడిగానూ తన ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్న ఆయనకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త కోలీవుడ్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ధనుష్ తన పెద్ద కుమారుడు యాత్రను హీరోగా పరిచయం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ధనుష్ సొంత నిర్మాణ సంస్థ వుండర్‌బార్ ఫిల్మ్స్‌తో కలిసి ఆర్‌టేక్ స్టూడియోస్ నిర్మించనున్నట్లు టాక్. ప్రస్తుతం యాత్ర నటన, డ్యాన్స్‌లలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడని, త్వరలోనే అతడిపై టెస్ట్ షూట్ నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. ధనుష్ ప్రస్తుతం చేతిలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసిన తర్వాత ఈ సినిమాను పట్టాలెక్కించే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించనున్నట్లు, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ వేల్‌రాజ్ ఛాయాగ్రహణ బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. కానీ తండ్రి దర్శకత్వంలో కొడుకు హీరోగా అరంగేట్రం చేయనున్నాడనే ప్రచారం మాత్రం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277